

అనుక్షణం ప్రజల పక్షం

RNI NO: TELTEL/2023/87607

జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..

WANTED
రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త
దిన పత్రికలో పని చేయుటకు
తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని
అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త JV NEWS
ఎడిటర్: బిర్రు కరుణాకర్
Cell:9701249103

సంపుటి - 3 సంచిక -146 ఆదివారం15 నవంబర్ 2026 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజీలు -8 వెల - 5/-

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts



గిగ్ వర్కర్లు దేశానికి పునాదులు

'గిగ్ వర్కర్ల చట్టం' ప్రారంభోత్సవంలో రాహుల్

వారిని గౌరవించడమే కాంగ్రెస్ విధానం

గిగ్ వర్కర్లకు రూ.5 లక్షల ప్రమాద బీమా,

10లక్షల ఆరోగ్య బీమా అమలు చేసేలా చట్టం

ప్రతి డెలివరీ చార్జీలో 1శాతం.. వారి భవిష్యత్తు కోసం

గాంధీ కుటుంబం మాటిస్తే.. అది చట్టంతో సమానం

కార్మికులకు అధికారిక గుర్తింపు కార్డులు: రేవంత్

గిగ్ వర్కర్లతో కలిసి రాహుల్, రేవంత్ బైక్ ర్యాలీ

హైదరాబాద్ నవంబర్ 14 (జర్నలిస్ట్ వార్త):

గిగ్ వర్కర్లు దేశానికి అసలైన పునాదులని, వారిని కార్మికులుగా కాకుండా భాగస్వాములుగా గౌరవించడమే కాంగ్రెస్ పార్టీ విధానమని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ స్పష్టం చేశారు. గతంలో తెలంగాణ గిగ్ వర్కర్లను కలిసినప్పుడు వారి కష్టాలను స్వయంగా విన్నానని, అన్ని రకాలుగా భద్రత కల్పిస్తామని ఆ రోజే వారికి మాట ఇచ్చానని గుర్తు చేశారు. నాడు ఇచ్చిన హామీ మేరకు సీఎం రేవంత్ నేతృత్వంలోని ప్రభుత్వం కొత్త చట్టాన్ని తీసుకొచ్చిందని పేర్కొన్నారు. **మిగతా 2లో...**



అండర్-19 ఆసియా కప్ విజేతగా భారత్..

పాకిస్థాన్‌పై ఒక్క వికెట్ తేడాతో గెలిచిన భారత్



యువ జట్టుకు ప్రధాని మోదీ ప్రశంసలు

రికార్డు స్థాయిలో తొమ్మిదోసారి అండర్-19 ఆసియా కప్ కైవసం

యువ జట్టు అద్భుత ప్రదర్శనపై ప్రధాని నరేంద్ర మోదీ ప్రశంసలు

ఆఖరి బంతికి బౌండరీ బాది జట్టును గెలిపించిన మోహిత్ ఉల్వా

ఆకట్టుకున్న కెప్టెన్ లక్ష్య రాయ్‌చందానీ, ఆర్యవీర్ సెహ్వాగ్

ఢిల్లీ నవంబర్ 14 (జర్నలిస్ట్ వార్త):

మస్కట్ వేదికగా జరిగిన పురుషుల అండర్-19 ఆసియా కప్ 2026 ఫైనల్ పోరులో భారత యువ జట్టు అద్భుత విజయాన్ని అందుకుంది. దాయాది పాకిస్థాన్‌తో చివరి బంతి వరకు అత్యంత ఉత్కంఠభరితంగా సాగిన ఫైనల్లో టీమిండియా ఒక వికెట్ తేడాతో చిరస్మరణీయ విజయం సాధించి ఛాంపియన్‌గా నిలిచింది. రికార్డు స్థాయిలో తొమ్మిదోసారి ఈ ట్రోఫీని ముద్దాడిన యువ జట్టుపై ప్రధాని నరేంద్ర మోదీ ప్రశంసల వర్షం కురిపించారు. **మిగతా 2లో...**



సీనియర్ నటుడు గిరిబాబు కన్నుమూత

టాలీవుడ్ లో విషాదం -అనారోగ్యంతో తుదిశ్వాస విడిచిన గిరిబాబు

గిరిబాబు వయసు 80 సంవత్సరాలు

600కి పైగా చిత్రాల్లో నటించిన గిరిబాబు

2లో.

కూటమి బలపరిచిన అభ్యర్థులే గెలవాలి

పంచాయతీ ఎన్నికలను తేలిగ్గా తీసుకోవద్దు.. : సీఎం చంద్రబాబు

పరిషత్ మరియు మున్సిపల్ ఎన్నికల్లో కూటమి ప్రభంజనం

గ్రామాల్లోనూ ప్రభంజనం కొనసాగాలన్న టీడీపీ అధినేత


రాబోయే 30 ఏళ్లకు ఉపయోగపడేలా నాయకత్వ నిర్మాణం చేపడదామని సంకల్పం

ఎట్టి పరిస్థితుల్లో గొడవలకు పోవద్దన్న ముఖ్యమంత్రి

గతం కంటే కూటమికి 25 శాతం ఓటు బ్యాంకు పెరిగిందని వెల్లడి

అమరావతి నవంబర్ 14 (జర్నలిస్ట్ వార్త):

ఆంధ్రప్రదేశ్‌లో ఇటీవల జరిగిన మున్సిపల్, పరిషత్ ఎన్నికల్లో ప్రజలు కూటమి ప్రభుత్వానికి చారిత్రక విజయాన్ని అందించారని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. పార్టీ ముఖ్యనేతలతో నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా 94 మున్సిపాలిటీల్లో, 3,235 వార్డుల్లో ఎన్డీఏ అభ్యర్థులు ఘన విజయం సాధించారని తెలిపారు. అలాగే 575 జడ్పీటీసీ స్థానాలు, 7,500 కంటే ఎక్కువ ఎంపీటీసీ స్థానాల్లో కూటమి నిలబెట్టిన అభ్యర్థులు జయకేతనం ఎగురవేశారని వివరించారు. **మిగతా 2లో...**





హైదరాబాద్‌లో పెట్ ఫెడ్..

నవంబర్ 21, 22 తేదీల్లో నోవోటెల్ వేదికగా ఈవెంట్

పెట్ ఫ్యాషన్ షోలు, అడాప్షన్ జోన్ల ఏర్పాటు

మూగజీవాల సంరక్షణపై నిపుణులతో మాస్టర్‌క్లాస్‌లు

హైదరాబాద్ నవంబర్ 14 (జర్నలిస్ట్ వార్త):

పెంపుడు జంతువుల ప్రేమికులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూసే ప్రసిద్ధ ఉత్సవం 'పెట్ ఫెడ్' మొట్ట మొదటిసారిగా హైదరాబాద్‌లో అడుగుపెడుతోంది. నగరంలోని నోవోటెల్ హోటల్ ప్రాంగణంలో నవంబర్ 21, 22 తేదీల్లో ఈ ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నారు. పెట్ ఫెడ్ చరిత్రలోనే హైదరాబాద్ నగరం**మిగతా 2లో...**

తెలంగాణ ప్రజలకు రాహుల్ గాంధీ సమాధానం చెప్పాలి: కేటీఆర్

హైదరాబాద్ పర్యటనలో ఉన్న ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీని నిలదీసిన కేటీఆర్

కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టో అబద్ధాల పుట్ట అంటూ ఎక్స్ వేదికగా ధ్వజం

420 హామీలు, 13 డిక్లరేషన్లు, 6 గ్యారెంటీల అమలుపై సూటి ప్రశ్నలు

హైదరాబాద్/నవంబర్ 14 (జర్నలిస్ట్ వార్త):

తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలుపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ హైదరాబాద్ పర్యటన నేపథ్యంలో ఆయన సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా ప్రశ్నల వర్షం కురిపించారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ఎందుకు అమలు చేయడం లేదో రాష్ట్ర **మిగతా 2లో...**



ఉత్తర కోస్తా దిశగా తుఫాన్ 'అక్వాన్'గా నామకరణం

20న తీరం దాటే అవకాశం -18 నుంచి మూడు రోజులు వర్షాలు

మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని హెచ్చరిక



విశాఖపట్నం, అమరావతి,నవంబర్ 14 (జర్నలిస్ట్ వార్త):

తుఫాను ఉత్తర కోస్తా దిశగా దూసుకు వస్తోంది. ఈ నెల 20న తీరం దాటే అవకాశం ఉంది. ఇందుకు తగ్గట్టుగా జాగ్రత్తలు తీసుకోవాలని భారత వాతావరణ శాఖ హెచ్చరిస్తోంది. ఆగ్నేయ బంగాళాఖాతంలో శుక్రవారం ఏర్పడిన అల్పపీడనం అదే ప్రాంతంలో శనివారం ఉదయానికి తీవ్ర అల్పపీడనంగా బలపడింది**మిగతా 2లో...**

అక్రమ అరెస్టులతో బీజేపీని ఆపలేరు

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు -భారత్ సమ్మిట్ అట్టర్ ఫ్లాప్: సంజయ్

దేశ వ్యతిరేక శక్తులతో సమ్మిట్: ఈటల -రాంచందర్‌సహా పలువురి గృహ నిర్బంధం

హైదరాబాద్/నవంబర్ 14 (జర్నలిస్ట్ వార్త):

కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహించింది యాంటీ భారత్ సమ్మిట్ అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు ఆరోపించారు. రాహుల్‌గాంధీ హాజరైన భారత్ సమ్మిట్.. రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకువచ్చే సదస్సు కాదని, దేశ అంతర్గత రాజకీయ పరిస్థితులను విదేశీయులకు వివరించేందుకు కాంగ్రెస్ పెట్టిన కార్యక్రమమని విమర్శించారు. భారత్ సమ్మిట్‌కు వ్యతిరేకంగా శాంతియుత నిరసనలకు పిలుపునిచ్చిన నేపథ్యంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావును తార్నాకలోని ఆయన నివాసంలో ఓయూ పోలీసులు శనివారం గృహనిర్బంధం చేశారు. **మిగతా 2లో...**



అందరికీ ప్రజల పత్రిక
RNI NO: TELTEL/2023/87607
జర్నలిస్ట్ వార్త
తెలుగు దిన పత్రిక


సీనియర్ నటుడు గిరిబాబు కన్నుమూత

టాలీవుడ్ లో విషాదం -అనారోగ్యంతో తుదిశ్వాస విడిచిన గిరిబాబు

గిరిబాబు వయసు 80 సంవత్సరాలు

600కి పైగా చిత్రాల్లో నటించిన గిరిబాబు





హైదరాబాద్ నవంబర్ 14 (జర్నలిస్ట్ వార్త):
తెలుగు చిత్ర పరిశ్రమలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. ప్రముఖ సీనియర్ నటుడు గిరిబాబు (80) కన్నుమూశారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన, హైదరాబాద్ కొండాపూర్ లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ నేడు తుదిశ్వాస విడిచారు. ఆయన మృతితో టాలీవుడ్ పరిశ్రమలో విషాద ఛాయలు అలముకున్నాయి.గిరిబాబు పూర్తి పేరు యర్రా శేషగిరిరావు. ఆయన 1946 జూన్ 8న ఉమ్మడి ప్రకాశం జిల్లా రావినూతలలో జన్మించారు. చిన్నతనం నుంచే నాటకాలు, కళారంగంపై ఉన్న ఆసక్తితో ఆయన సినిమా రంగం వైపు అడుగులు వేశారు. 1973లో విడుదలైన 'జగమే మాయ' చిత్రంతో ఆయన నటుడిగా వెండితెరకు పరిచయమయ్యారు. ప్రారంభంలో కథానాయకుడిగా కొన్ని సినిమాలు చేసినప్పటికీ, ఆ తర్వాత ప్రతినాయకుడిగా (విలన్), హాస్య నటుడిగా, క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా మారి తనదైన ప్రత్యేక శైలితో ప్రేక్షకుల అభిమానాన్ని చూరగొన్నారు.
నాలుగు దశాబ్దాలకు పైగా సాగిన తన సినీ ప్రస్థానంలో గిరిబాబు 600కు పైగా చిత్రాల్లో నటించారు. ఎన్టీఆర్, ఏఎన్ఆర్, కృష్ణ, మోహన్ బాబు వంటి అగ్ర కథానాయకులందరితోనూ కలిసి నటించిన అనుభవం ఆయన సొంతం. 1977లో వచ్చిన పౌరాణిక చిత్రం 'కురుక్షేత్రం'లో దుశ్శాసనుడి పాత్రలో ఆయన చూపిన నటన ప్రేక్షకులకు చిరకాలం గుర్తుండిపోయింది. ఆ తర్వాత జ్యోతి, మెరుపు దాడి, పసివాడి ప్రాణం, బాలగోపాలుడు, హలో బ్రదర్, సిసింద్రి, లిటిల్ సోల్జర్స్, నిన్నే పెళ్లాడతా, చంద్రలేఖ, నువ్వే కావాలి వంటి ఎన్నో సూపర్ హిట్ చిత్రాల్లో వైవిధ్యమైన పాత్రలను పోషించారు.మారుతున్న కాలానికి అనుగుణంగా కొత్త తరం హీరోల చిత్రాల్లోనూ నటించి మెప్పించారు. మహేశ్ బాబు 'అతడు' చిత్రంలో హీరోయిన్ తండ్రిగా ఆయన చేసిన నటన విశేష ఆదరణ పొందింది. అలాగే గమ్యం, అ ఆ, గీత గోవిందం, డిస్కో రాజా, మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచ్‌లర్, జాతి రత్నాలు వంటి సినిమాల్లో విభిన్న పాత్రలతో చివరి వరకూ ప్రేక్షకులను అలరిస్తూనే ఉన్నారు.గిరిబాబు కేవలం నటుడిగానే కాకుండా దర్శకుడిగా, నిర్మాతగా కూడా పరిశ్రమకు విశేష సేవలందించారు. ఆయన స్వీయ దర్శకత్వంలో 'రణరంగం' (1985), 'ఇంద్రజిత్' (1990), 'నీ సుఖమే నే కోరుతున్నా' (2008) వంటి సినిమాలు తెరకెక్కాయి. అలాగే 'మెరుపు దాడి', 'దేవతలారా దీవించండి' వంటి పలు చిత్రాలకు నిర్మాతగానూ వ్యవహరించారు. గిరిబాబు మరణం పట్ల సినీ ప్రముఖులు, అభిమానులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నారు.గిరిబాబుకు ఇద్దరు సంతానం కాగా, పెద్ద కుమారుడు రఘుబాబు ప్రముఖ కమెడియన్ గా కొనసాగుతున్నారు. చిన్న కుమారుడు బోసుబాబు గతంలో ఓ చిత్రంలో నటించారు. గిరిబాబు అర్ధాంగి శ్రీదేవి 2018లో కన్నుమూశారు.

అండర్-19 ఆసియా కప్ విజేతగా భారత్..

మొదటిపేజీ తరువాయి



భారత జట్టు సాధించిన ఈ చారిత్రక విజయంపై ప్రధాని మోదీ సోషల్ మీడియా వేదికగా స్పందించారు. "భారత క్రికెట్‌కు ఇది ఎంతో గొప్ప రోజు. నేటి మ్యాచ్‌లో అద్భుత ప్రదర్శన కనబరిచి మెన్స్ అండర్-19 ఆసియా కప్ 2026 గెలిచిన మన యువ క్రికెటర్లను చూసి ఎంతో గర్వపడుతున్నాను. వీరి విజయం ఎంతోమంది యువతకు స్ఫూర్తినిస్తుంది. భవిష్యత్తులో ఈ జట్టు మరిన్ని విజయాలు సాధించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను" అని ప్రధాని తన పోస్టులో పేర్కొన్నారు.అల్ అమెరత్ క్రికెట్ గ్రౌండ్‌లో శనివారం జరిగిన ఈ హై-వోల్టేజ్ ఫైనల్ మ్యాచ్‌లో టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన పాకిస్థాన్ నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 337 పరుగుల భారీ స్కోరు సాధించింది. పాక్ బ్యాటర్లలో ఉస్మాన్ ఖాన్ 107 పరుగులతో సెంచరీ సాధించగా, అబ్దుల్ ఖాదిర్ 80, కెప్టెన్ ఫర్హాన్ యూసుఫ్ 63 పరుగులతో రాణించారు. భారత బౌలర్లలో కావ్య పటేల్ నాలుగు వికెట్లతో సత్తా చాటగా, చిగురుపాటి వెంకట మూడు వికెట్లు తీసి ప్రత్యర్థిని కట్టడి చేశారు.అనంతరం 338 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్.. 50 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 339 పరుగులు చేసి విజయాన్ని అందుకుంది. భారత కెప్టెన్ లక్ష్య రాయ్‌చందానీ 101 బంతుల్లో 80 పరుగులు చేసి బాధ్యతాయుత ఇన్నింగ్స్ ఆడగా, ఆర్యవీర్ సెహ్వాగ్ 61 బంతుల్లో 58 పరుగులు చేసి మంచి ఆరంభాన్ని ఇచ్చారు. అయితే, మధ్యలో స్వల్ప వ్యవధిలోనే వికెట్లు కోల్పోయిన భారత్ 254 పరుగులకే 8 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది.ఈ దశలో మనల్ చౌహాన్, మోహిత్ ఉల్వా అద్భుత పోరాటపటిమ కనబరిచారు. వీరిద్దరూ కలిసి 9వ వికెట్‌కు 57 పరుగుల కీలక భాగస్వామ్యాన్ని నెలకొల్పి మ్యాచ్‌ను తిరిగి భారత్ వైపు తిప్పారు. చౌహాన్ 32 బంతుల్లో 47 పరుగులు చేసి అవుటైనా, ఉల్వా క్రీజులో పాతుకుపోయి ఒత్తిడిని సమర్థంగా ఎదుర్కొన్నాడు.చివరి ఓవర్లో భారత్ విజయానికి 8 పరుగులు అవసరం కాగా.. మోహిత్ ఉల్వా, చిగురుపాటి వెంకట నిలకడగా ఆడి సమీకరణాన్ని చివరి బంతికి 3 పరుగులుగా మార్చారు. ఆఖరి బంతికి అహ్మద్ హుస్సేన్ వేసిన డెలివరీని మోహిత్ ఉల్వా బౌండరీకి తరలించి భారత్‌కు చిరస్మరణీయ విజయాన్ని అందించాడు. ఉల్వా 49 పరుగులతో అజేయంగా నిలిచి జట్టును గెలిపించాడు. దీంతో డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగిన పాకిస్థాన్‌కు నిరాశ ఎదురవ్వగా, భారత్ తొమ్మిదోసారి ఆసియా కప్ ట్రోఫీని కైవసం చేసుకుంది.

గిగ్ వర్కర్లు దేశానికి పునాదులు

మొదటిపేజీ తరువాయి



హైదరాబాద్ మాదాపూర్‌లోని జయభేరి గ్రౌండ్‌లో శనివారం నిర్వహించిన 'తెలంగాణ గిగ్ వర్కర్ల సామాజిక భద్రత, సంక్షేమ పథకం' ప్రారంభోత్సవ సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. హైదరాబాద్‌తోపాటు ఇతర నగరాల్లోనూ గిగ్ వర్కర్ల కోసం వై-ఫై సౌకర్యంతో కూడిన విశ్రాంతి కేంద్రాలను ప్రభుత్వం నిర్మించనుందని చెప్పారు. అక్కడ వాహనాన్ని పార్కింగ్ చేసుకుని, విశ్రాంతి తీసుకోవచ్చన్నారు. ప్రతి గిగ్ వర్కర్‌కు రూ. 5 లక్షల ప్రమాద బీమా, రూ. 10 లక్షల ఆరోగ్య బీమా అందించడానికి ప్రభుత్వం గ్యారెంటీ ఇస్తోందని వెల్లడించారు.
గిగ్ వర్కర్లకూ వారికీ సామాజిక భద్రత ఉండాలని, వారి భవిష్యత్తు కోసం డబ్బు ఆదా కావాలని పేర్కొన్నారు. అందుకే వారు పూర్తి చేసే ప్రతి డెలివరీ, ప్రతి రైడ్ చార్జీలో 1శాతం మొత్తాన్ని వారి భవిష్యత్తు భద్రతకు వినియోగిస్తామని, సదరు మొత్తాన్ని ఆయా కంపెనీలు గిగ్ వర్కర్స్ బోర్డులో జమ చేస్తాయని తెలిపారు. బోర్డు ద్వారా ఆ సొమ్ము నేరుగా గిగ్ వర్కర్ల బ్యాంక్ ఖాతాలకు చేరుతుందన్నారు. కొత్త చట్టం ప్రకారం వారు చేసే పని, పూర్తి చేసే రైడ్లు, డెలివరీలు, ప్రతి రైడ్ లేదా లావాదేవీకి ఎంత డబ్బు చెల్లిస్తున్నారనే పూర్తి సమాచారం వారికి అందుబాటులోకి రానుందని వివరించారు. కార్మికులను కేవలం సేవకులు, బానిసలుగా అణచివేయాలనేది బీజేపీ, ఆర్ఎస్ఎస్ సిద్ధాంతమైతే.. కార్మికులకు భద్రత కల్పించి భాగస్వాములుగా మార్చడమే కాంగ్రెస్ భావజాలమని స్పష్టం చేశారు. గిగ్ వర్కర్ల కష్ట ఫలితం అంబానీ-అదానీలకు దక్కాలని, ఉబర్..ఓలా యాజమాన్యాలకు అందాలని ప్రధాని మోదీ భావిస్తున్నారని ఆరోపించారు. వారికి భద్రత, రక్షణ కల్పించాలని తాము భావిస్తున్నామన్నారు. గిగ్ వర్కర్లు భయపడాల్సిన పని లేదని, రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డితోపాటు తెలంగాణ ప్రభుత్వం, కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటాయని భరోసా ఇచ్చారు. గిగ్ వర్కర్ల కుటుంబాల్లోని పిల్లల విద్య బాధ్యతను తీసుకోవడానికి ప్రయత్నిస్తామని హామీ ఇచ్చారు.

రాహుల్ ఇచ్చిన హామీని నెరవేర్చాం

"గాంధీ కుటుంబం మాట ఇస్తే.. సువర్ణ అక్షరాలతో లిఖించిన చట్టంతో సమానం.. కొత్త చట్టం ద్వారా గతంలో గిగ్‌వర్కర్లకు రాహుల్ గాంధీ ఇచ్చిన హామీని నెరవేర్చాం" అని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. 2023లో కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు 4000 కిలో మీటర్ల పాదయాత్ర చేపట్టిన రాహుల్ గాంధీ.. పేదలు, కార్మికుల సమస్యలను స్వయంగా తెలుసుకున్నారని గుర్తు చేశారు. నాడు హైదరాబాద్‌కు వచ్చిన సమయంలో గిగ్ వర్కర్ల సమస్యలపై స్పందించిన రాహుల్‌గాంధీ.. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే ప్రత్యేక చట్టం తీసుకొస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. నెహ్రూ జన్మదినం సందర్భంగా రాహుల్ గాంధీ చేతుల మీదుగానే కొత్త చట్టాన్ని అమలులోకి తీసుకురావడం సంతోషంగా ఉందన్నారు.
ఆన్‌లైన్ డెలివరీలు, క్యాబ్, ఆటో సర్వీసులు అందిస్తున్న గిగ్ వర్కర్లకు ప్రభుత్వం తరఫున రూ.5లక్షల ప్రమాద బీమా కల్పిస్తున్నామని తెలిపారు. ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.10లక్షలకు పెంచి కార్మికుల కుటుంబాలకు ఆరోగ్య భరోసా కల్పించామన్నారు. గిగ్ వర్కర్ల సంక్షేమం, వారి హక్కులను కాపాడేందుకు ప్రత్యేకంగా గిగ్ వర్కర్స్ బోర్డును ఏర్పాటు చేసినట్లు ప్రకటించారు. అర్హులైన ప్రతి కార్మికుడికి అధికారిక గుర్తింపు కార్డులు అందజేస్తామని వెల్లడించారు. 'రాష్ట్రంలో ఏ కార్మికుడూ అభద్రతాభావంతో బతకాల్సిన అవసరం లేదు. మీ చెమట విలువను గుర్తిస్తూ ఈ ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుంది' అని భరోసా కల్పించారు. గిగ్ వర్కర్ల తరఫున రాహుల్‌గాంధీకి హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా గిగ్ వర్కర్ల సంక్షేమ పథకం అమలు పాలసీ బుక్‌ను ఆవిష్కరించిన రాహుల్, సీఎం రేవంత్‌రెడ్డి ఆవిష్కరించారు.

గిగ్ స్టాప్‌లను ప్రారంభించిన రాహుల్

గిగ్ వర్కర్ల కోసం ఏర్పాటు చేసిన విశ్రాంతి కేంద్రాలను (గిగ్ స్టాప్‌లను) సీఎం రేవంత్‌రెడ్డితో కలిసి రాహుల్ గాంధీ ప్రారంభించారు. గిగ్ వర్కర్ల కోసం ప్రత్యేకంగా రూపొందించిన బస్సులో రెస్ట్ రూమ్‌లు అందుబాటులో ఉన్నాయి. వివిధ ప్రాంతాల్లో తిరిగే గిగ్ వర్కర్లు విశ్రాంతి తీసుకునేలా ఈ బస్సును రూపొందించారు. అలాగే, సైబరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ సౌజన్యంతో తొలుత పటాన్‌చెరు, తెల్లాపూర్, చందానగర్, భారతీనగర్, కొండాపూర్ ప్రాంతాల్లో గిగ్ స్టాప్‌లను అందుబాటులోకి తెచ్చారు. గిగ్ వర్కర్లు ఎవరైనా సరే అందులో కూర్చుని తినవచ్చు. సేద తీరొచ్చు. కాలకృత్యాలను తీర్చుకోవచ్చు. ఈ రంగంలో పని చేస్తున్న దివ్యాంగ గిగ్ వర్కర్లకు ఈ గిగ్‌స్ట్టపలు ఎంతగానో దోహదపడనున్నాయి.

గిగ్ వర్కర్లతో రాహుల్ బైక్ ర్యాలీ

గిగ్ వర్కర్లతో కలిసి రాహుల్ గాంధీ బైక్ ర్యాలీలో పాల్గొన్నారు. తొలుత హైటెక్ సిటీలోని శిల్పారామం ముందు ఉన్న ఇందిరాగాంధీ విగ్రహానికి సీఎం రేవంత్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్‌తో కలిసి నివాళులర్పించారు. అనంతరం ర్యాపిడో బైకర్ లలిత స్కూటీపై రాహుల్ గాంధీ, మరో బైక్‌పై సీఎం రేవంత్ ప్రయాణించారు. పార్టీ కార్యకర్తలు, ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు. శిల్పారామం నుంచి జయభేరి గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన సభ వరకు ర్యాలీ సాగింది.

కూటమి బలపరిచిన అభ్యర్థులే గెలవాలి

మొదటిపేజీ తరువాయి

ఈవీఎంలు అయినా, బ్యాలెట్ పేపర్లు అయినా, చివరకు పోస్టల్ బ్యాలెట్లలోనైనా ప్రజలు కూటమికే సంపూర్ణ మద్దతు పలికారన్నారు.ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల వల్లే గతంతో పోలిస్తే కూటమికి ఓటు బ్యాంకు ఏకంగా 25 శాతం పెరిగిందని చంద్రబాబు తెలిపారు. ఉద్యోగులంతా ప్రభుత్వ విధానాలకు మద్దతుగా నిలిచారని, వైసీపీ తప్పుడు ప్రచారాలను ప్రజలు ఏమాత్రం నమ్మలేదని పేర్కొన్నారు. సుమారు 7 జిల్లాల్లో కూటమి క్లీన్ స్వీప్ చేసిందని, ముఖ్యంగా అనకాపల్లి, మార్కాపురం జిల్లాల ప్రజలు 100 శాతం స్ట్రైక్ రేట్ ఇచ్చారని గుర్తుచేశారు. పోలవరం ఎడమ కాల్వ ద్వారా అనకాపల్లికి నీటిని అందించడం, మార్కాపురం కొత్త జిల్లా ఏర్పాటు, వెలిగొండ ప్రాజెక్ట్ ఫేజ్-1 ఫలాలు ఈ ఫలితాల్లో స్పష్టంగా ప్రతిబింబించాయని విశ్లేషించారు.రాబోయే రోజుల్లో జరగనున్న మరో 23 పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ కూటమి అభ్యర్థులు తిరుగులేని విజయం సాధించాలని నేతలకు దిశానిర్దేశం చేశారు. అదేవిధంగా గ్రామ పంచాయతీ ఎన్నికలను ఏమాత్రం తేలిగ్గా తీసుకోవద్దని హెచ్చరించారు. గ్రామాల్లో కూడా కూటమి బలపరిచే అభ్యర్థులే గెలవాలని, క్షేత్రస్థాయిలో ప్రజల ఆదరణ ఉన్న మంచి వ్యక్తులను, విద్యావంతులను, యువతను ప్రోత్సహించాలని సూచించారు. క్షేత్రస్థాయిలో సరైన నాయకులను తీర్చిదిద్దుకోవడానికి ఈ ఎన్నికలు చక్కటి అవకాశమని, రాబోయే 30 ఏళ్లకు ఉపయోగపడేలా బలమైన నాయకత్వాన్ని నిర్మించుకోవాలని పిలుపునిచ్చారు.
కేంద్రం, రాష్ట్రం, మున్సిపాలిటీలు, జిల్లా పరిషత్‌లలో ఇప్పటికే ఎన్డీఏ అధికారంలో ఉందని, పంచాయతీల్లోనూ మన అభ్యర్థులు గెలిస్తే పాలన, అభివృద్ధి కార్యక్రమాలు మరింత వేగంగా, సజావుగా ముందుకు సాగుతాయని చంద్రబాబు పేర్కొన్నారు. ప్రజల మనోభావాలకు అనుగుణంగా పనిచేసినంత కాలం వారు మన వెంటే ఉంటారని స్పష్టం చేశారు. కొందరు కావాలనే హింసను నమ్ముకుంటారని, కానీ కూటమి పూర్తిగా ప్రజాస్వామ్యాన్ని మాత్రమే నమ్ముతుందని చెప్పారు. నాయకులెవరూ ఎట్టి పరిస్థితుల్లోనూ గొడవలకు పోవద్దని, చెడ్డ పేరు తెచ్చుకోవద్దని గట్టిగా హెచ్చరించారు. అధికారాన్ని కేవలం ప్రజలకు మంచి చేయడానికి, వారికి మరింత చేరువ కావడానికి మాత్రమే ఉపయోగించుకోవాలని సీఎం హితవు పలికారు. గెలిచిన ఎంపీటీసీలు, జడ్పీటీసీలు నిరంతరం ప్రజల్లో ఉంటూ పార్టీ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లాలని సూచించారు.

ఉత్తర కోస్తా దిశగా తుఫాన్

.మొదటిపేజీ తరువాయి

ఇది వాయవ్యంగా పయనించి ఆదివారం నాటికి వాయుగుండంగా మారనున్నది. ఆ తర్వాత ఉత్తర వాయవ్యంగా పయనించి ఈ నెల 16వ తేదీ సాయంత్రానికి తుఫానుగా బలపడి బంగాళాఖాతంలోకి ప్రవేశించనున్నది. దీనికి ఇరాన్ దేశం సూచించిన 'అక్వాన్' అని పేరు పెట్టనున్నారు.
ఇది ఉత్తర వాయువ్యంగా పయనించి 18వ తేదీ ఉదయానికి తీవ్ర తుఫాన్‌గా బలపడి రెండు రోజులపాటు సముద్రంలోనే కొనసాగుతుంది. ఆ సమయంలో భూ ఉపరితలం నుంచి చలిగాలులు వీచే అవకాశం ఉన్నందున సముద్రంలో కొంత బలహీనపడి తుఫాన్‌గా లేదా వాయుగుండం/తీవ్ర వాయుగుండంగా మారి 20వ తేదీ ఉదయం ఉత్తర కోస్తాలో తీరం దాటుతుందని అంచనా వేస్తున్నారు. సముద్రంలో కొనసాగిన సమయంలో గాలులు 100 కిలోమీటర్ల వేగంతో వీచే అవకాశం ఉందని, తీరం దాటే సమయంలో గాలుల వేగం కొంతవరకు తగ్గుతుందని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. కాగా, ఆదివారం నాటికి వాయుగుండంగా బలపడిన తరువాత కోస్తాలో తీరం వెంబడి గాలుల వేగం పెరుగుతుంది.అందువల్ల మత్స్యకారులు సముద్రంలో చేపల వేటకు వెళ్లవద్దని తుఫాన్ హెచ్చరిక కేంద్రం తెలిపింది. ఈ నెల 18 నుంచి 20 వరకు కోస్తాలో విస్తారంగా, ఉత్తర కోస్తాలో అక్కడక్కడా భారీ వర్షాలు కురుస్తాయి. ఈ నెల 19న ఉత్తర కోస్తాలో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయని తుఫాను హెచ్చరిక కేంద్రం తెలిపింది. వాతావరణ పరిస్థితుల ప్రభావంతో సముద్రంలో తీవ్ర తుఫాను కొంతవరకు బలహీనపడినా ఉత్తర కోస్తాలో గాలులు వీస్తాయని, వర్షాలు కురుస్తాయని తెలిపారు.
కాగా నవంబరు నెలలో తుఫాన్లు ఎక్కువగా దక్షిణ కోస్తా, ఉత్తర తమిళనాడుల్లో తీరం దాటుతాయి. నవంబరు రెండో వారం తరువాత ఉత్తర కోస్తాలో తుఫాన్లు తీరం దాటడం, తీరం దిశగా రావడం 125 ఏళ్లలో ఒక్కసారే జరిగింది. 1998 నవంబరు 15న ప్రస్తుత అనకాపల్లి జిల్లా పూడిమడక ప్రాంతంలో తుఫాన్ తీరం దాటిందని వాతావరణ అధికారి ఒకరు తెలిపారు.

హైదరాబాద్‌లో పెట్ ఫెడ్..

మొదటిపేజీ తరువాయి

ఈ ఈవెంట్‌కు ఆతిథ్యమివ్వడం ఇదే తొలిసారి కావడంతో స్థానిక పెట్ లవర్స్‌లో మంచి ఆసక్తి నెలకొంది.ఈసారి పెట్ ఫెడ్ తన 12వ ఎడిషన్‌లోకి అడుగుపెట్టింది. నవంబర్ 2026 నుంచి మార్చి 2027 వరకు దేశంలోని ఐదు ప్రధాన నగరాల్లో ఈ ఫెస్టివల్ పర్యటించనుంది. హైదరాబాద్‌తో మొదలయ్యే ఈ ప్రయాణం అనంతరం ఢిల్లీ, బెంగళూరు, పూణే మీదుగా ముంబైలో ముగుస్తుంది.రెండు రోజుల పాటు సాగే ఈ వేదుకలో పెంపుడు జంతువుల కోసం పలు రకాల ఆకర్షణీయమైన పోటీలు, ప్రత్యేక కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నారు. 'పెట్స్ గాట్ టాలెంట్', ప్రత్యేక ఫ్యాషన్ షో, క్యాటాపలూజా, ఇంటర్నేషనల్ క్యాట్ షో, సెక్యూరిటీ డాగ్ షో వంటి ఈవెంట్లు సందర్శకులను విశేషంగా అలరించనున్నాయి. వీటితో పాటు దేశీయ జాతి శునకాల యజమానుల (ఇండీ పెట్ పేరెంట్స్) కోసం ప్రత్యేక కార్యక్రమాలు, జంతువుల ఆటపాటల కోసం డెడికేటెడ్ ప్లే, ఎజిలిటీ జోన్లు సిద్ధం చేస్తున్నారు.పెంపుడు జంతువులను దత్తత తీసుకోవాలనుకునే వారి కోసం ప్రత్యేకంగా 'అడాప్షన్ జోన్లు' ఏర్పాటు చేయనున్నారు. అలాగే పెట్స్ పెంపకం, ఆరోగ్యం, ప్రవర్తన తదితర అంశాలపై సందేహాలు నివృత్తి చేసేందుకు నిపుణులతో మాస్టర్‌క్లాస్‌లు నిర్వహిస్తారు. వీటితో పాటు పెట్ ఉత్పత్తులకు సంబంధించిన షాపింగ్ స్టాళ్లు కూడా అందుబాటులో ఉంటాయి.
ఈ వేడుక గురించి సంస్థ వ్యవస్థాపకుడు అక్షయ్ గుప్తా మాట్లాడుతూ.. పెట్ ఫెడ్ అనేది కేవలం ఒక సాధారణ ఫెస్టివల్‌గా మాత్రమే మిగిలిపోలేదని, ఇది పెంపుడు జంతువుల ప్రేమికులందరినీ ఏకం చేసే ఒక పెద్ద కమ్యూనిటీగా ఎదిగిందని పేర్కొన్నారు. మూగజీవాల పట్ల అవగాహన, వాటి సంరక్షణ బాధ్యతను మరింత పెంచడమే ఈ వేదిక ముఖ్య ఉద్దేశమని వెల్లడించారు.

తెలంగాణ ప్రజలకు రాహుల్ గాంధీ సమాధానం చెప్పాలి: కేటీఆర్

మొదటిపేజీ తరువాయి

ప్రజలకు రాహుల్ గాంధీ వెంటనే సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టో 'అభయ హస్తం' పచ్చి అబద్ధాల పుట్ట అని కేటీఆర్ ఎద్దేవా చేశారు. తెలంగాణ ప్రజల సొమ్ముతో హైదరాబాద్‌లో పర్యటిస్తున్న రాహుల్ గాంధీ... కాంగ్రెస్ ఇచ్చిన 420 హామీలు, 13 డిక్లరేషన్లు, 6 గ్యారెంటీలపై ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. బీసీ డిక్లరేషన్‌లో భాగంగా రూ. 1 లక్ష కోట్ల బడ్జెట్ కేటాయిస్తామని చెప్పి, మూడేళ్లలో రూ. 5,000 కోట్లు కూడా కేటాయించలేదని కేటీఆర్ ఆరోపించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల హామీని కూడా గాలికి వదిలేశారని మండిపడ్డారు.అలాగే ఏడాదికి 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామని నమ్మబలికి, కేవలం 10 వేల ఉద్యోగాలతో సరిపెట్టారని విమర్శించారు. విద్యార్థులకు రూ. 5 లక్షల విద్యా భరోసా కార్డులు, పేద ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు రూ. 12 లక్షల చొప్పున ఇచ్చే అంబేద్కర్ అభయ హస్తం సాయం, మైనార్టీల నిధుల కేటాయింపుల్లోనూ ప్రభుత్వం విఫలమైందని ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేల ఫిరాయింపులు, రైతుల సమస్యలపై రాహుల్ గాంధీ ఎందుకు స్పందించడం లేదని కేటీఆర్ నిలదీశారు.

అక్రమ అరెస్టులతో బీజేపీని ఆపలేరు

మొదటిపేజీ తరువాయి

ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా బీజేపీ నేతలు, కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు.
అక్రమ అరెస్టులతో బీజేపీని ఆపలేరని పేర్కొన్నారు. రాష్ట్రం తీవ్ర కష్టాల్లో ఉన్నా పట్టించుకోని కాంగ్రెస్ ప్రభుత్వం.. ప్రజల సొమ్మును వెచ్చించి సమ్మిట్లు నిర్వహించడం దారుణమన్నారు. గతంలో రాహుల్‌గారొధీ విదేశాలకు వెళ్లి భారతదేశ ఆర్థిక వ్యవస్థను డెడ్ ఎకానమీ అంటూ అవమానించారని, ఇప్పుడు విదేశీయులను ఇక్కడికి తీసుకువచ్చి భారత్‌పై విషం చిమ్మించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. కాగా, భారత్ సమ్మిట్ అట్టర్ ఫ్లాప్ అయిందని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. వేదికపై నుంచి రాహుల్‌గాంధీ మధ్యలో వెళ్లిపోవడమే ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. విదేశీ ప్రతినిధుల ముందు భారత్ ప్రతిష్ఠను దిగజార్చేలా రాహుల్ మాట్లాడారని మండిపడ్డారు. విదేశీయుల ముందు భారత్‌ను అవమానించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.
ఇది ముమ్మాటికి దేశద్రోహమేనని మండిపడ్డారు. భారత్ సమ్మిట్ పేరుతో దేశాన్ని వ్యతిరేకించే శక్తులన్నీ ఒకే వేదికపైకి వచ్చాయని ఆరోపించారు. ప్రజాస్వామ్యం గురించి మాట్లాడుతున్న రాహుల్.. ముందుగా కాంగ్రెవీసలో ప్రజాస్వామ్యం ఉందో లేదో చెప్పాలని నిలదీశారు. ఎమర్జెన్సీ విధించి రాజ్యాంగ హక్కులను కాలరాసి లక్షలాది మందిని జైళ్లలో పెట్టిన చరిత్ర కాంగ్రెవీసదేనన్నారు. కాగా, కరువుతో రాష్ట్ర ప్రజలు అల్లాడుతుంటే.. భారత్ సమ్మిట్ పేరిట దేశ వ్యతిరేక శక్తులతో సమావేశం పెట్టాల్సిన అవసరం ఏంటని ఎంపీ ఈటల రాజేందర్ ప్రశ్నించారు. కనీసం ఎన్నికలు కూడా జరగని 42 ఇస్లామిక్ రాచరిక దేశాలు రాహుల్‌కు ఆదర్శమయ్యాయా? అని నిలదీశారు. నాటి ప్రధాని పీవీ నరసింహారావు స్వయంగా వాజ్‌పేయిని ఐక్యరాజ్యసమితికి పంపి భారత ఆత్మగౌరవాన్ని నిలబెట్టారని గుర్తుచేశారు. నేడు రాహుల్ మాత్రం విదేశాల్లో దేశం పరువు తీస్తున్నారని ఆయన మండిపడ్డారు.

అంతర్జాతీయ ప్రజల పత్రిక
RNI NO: TELTEL/2023/87607
జర్నలిస్ట్ వార్త
తెలుగు దిన పత్రిక
ఆదివారం15 నవంబర్ 2026

నెహ్రూ ఆశయాలతోనే దేశాభివృద్ధి సాధ్యం

వర్ధన్నపేటలో ఘనంగా పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతి వేడుకలు

వర్ధన్నపేట, నవంబర్ 14 (జర్నలిస్ట్ వార్త):
వర్ధన్నపేట మున్సిపల్ పట్టణ కేంద్రంలో భారత తొలి ప్రధానమంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పాలకుర్తి సారంగపాణి నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.



ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్య పోరాటంలో నెహ్రూ కీలక పాత్ర పోషించారని, స్వాతంత్ర్యం అనంతరం దేశ అభివృద్ధికి విశేష కృషి చేశారని తెలిపారు. విద్య, విజ్ఞాన శాస్త్రం, పారిశ్రామిక రంగాల అభివృద్ధికి పునాదులు వేశారని గుర్తుచేశారు. పిల్లలంటే ఎంతో ప్రేమ కలిగిన నెహ్రూ జన్మదినాన్ని బాలల దినోత్సవంగా జరుపుకుంటున్నామని పేర్కొన్నారు.

నేటి బాలలే రేపటి భారతదేశ భవిష్యత్తు అని, ప్రతి చిన్నారికి నాణ్యమైన విద్య, మంచి విలువలు, సమాన అవకాశాలు కల్పించాలని అన్నారు. విద్యార్థులు నెహ్రూ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని ఉన్నత లక్ష్యాలను సాధించాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నేతావత్ శిభారాణి–రాజేందర్, వార్డు కౌన్సిలర్లు సునావత్ కమిలి–కిమా నాయక్, మాలోతు దేవేందర్, తిరుపెల్లి వాణి–కుమారస్వామి, డైరెక్టర్ బక్కతట్ల రాజ్ యాదవ్, ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు మల్లేపాక సమ్మయ్య, మాజీ వార్డు కౌన్సిలర్ సమ్మెట సుధీర్, మంచాల రామకృష్ణ, నాయకులు బాబూలాల్, రాకేష్, కమలాకర్ రావు, రామచంద్రరెడ్డి, శ్రీకాంత్, లోడి, వెంకన్న, అంగోతు వెంకన్న, పూజారి రాజు, పాలకుర్తి శ్రీకాంత్, యాకుబ్, అంగోతు శ్రీధర్, రవీందర్, కొండేటి మహేందర్ తదితర ప్రజాప్రతినిధులు, మహిళా నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పేద కుటుంబాలకు రూ.5 లక్షల బీమా భరోసా

ఈ నెల 19 నుంచి ఇందిరమ్మ కుటుంబ బీమా పథకం ప్రారంభం.. డీసీసీ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్





వరంగల్/ నవంబర్ 14 (జర్నలిస్ట్ వార్త):
పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ కుటుంబ బీమా పథకాన్ని ప్రవేశపెడుతోందని వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్ తెలిపారు. ఈ నెల 19న సిద్దిపేట జిల్లాలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ పథకాన్ని ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. అర్హత కలిగిన ప్రతి రేషన్ కార్డు కుటుంబానికి రూ.5 లక్షల బీమా రక్షణ కల్పించనున్నట్లు పేర్కొన్నారు.

శనివారం వరంగల్‌లోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో భారత తొలి ప్రధానమంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి అయూబ్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. స్వాతంత్ర్య పోరాటంలో నెహ్రూ కీలక పాత్ర పోషించారని, స్వాతంత్ర్యం అనంతరం భారీ సాగునీటి ప్రాజెక్టులు, పారిశ్రామిక రంగం, విద్య, విజ్ఞాన శాస్త్రం అభివృద్ధికి పునాదులు వేశారని గుర్తుచేశారు. పిల్లలంటే ఆయనకు ఎంతో ప్రేమాభిమానాలని, వారి భవిష్యత్తుకు ప్రాధాన్యతనిచ్చినందునే ఆయన జయంతిని బాలల దినోత్సవంగా జరుపుకుంటున్నామని తెలిపారు.

ఇందిరమ్మ కుటుంబ బీమా పథకం ద్వారా అర్హత నిబంధనలకు లోబడి కుటుంబ సభ్యుల మరణం సంభవించినప్పుడు రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందించనున్నట్లు అయూబ్ వివరించారు. పేద కుటుంబాల్లో అనుకోని విషాదం చోటుచేసుకున్నప్పుడు ఆర్థిక ఇబ్బందులు ఎదురుకాకుండా ఈ పథకం అండగా నిలుస్తుందని అన్నారు.

ఈ నెల 19 నుంచి జిల్లా, మండల, పట్టణ, డివిజన్ స్థాయిల్లో అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి కుటుంబ యజమాని, కుటుంబ సభ్యుల వివరాలు సేకరించనున్నట్లు తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబానికి పథకంపై అవగాహన కల్పించాలని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ప్రజల కష్టాల్లో ప్రభుత్వం అండగా నిలవాలనే లక్ష్యంతో ఈ పథకాన్ని తీసుకొస్తున్నట్లు పేర్కొన్నారు.

బాలల భవిష్యత్తుకు బలమైన పునాది వేయాలి

మల్లారం ప్రాథమిక పాఠశాలలో ఘనంగా బాలల దినోత్సవ బాలసభ

తల్లాడ/నవంబర్ 14 (జర్నలిస్ట్ వార్త): మల్లారం గ్రామ ప్రాథమిక పాఠశాలలో శనివారం బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని బాలసభ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక సర్పంచ్ కటిక కిరణ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి మండల ప్రత్యేక అధికారి మల్లేశం, ఎంపీడీవో శ్రీధర్ రాజు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ దేశ భవిష్యత్తు బాలల చేతుల్లోనే ఉందని, చిన్నారులకు నాణ్యమైన విద్యతో పాటు క్రమశిక్షణ, నైతిక విలువలు అలవర్చాలని సూచించారు. చదువులోనే కాకుండా క్రీడలు, సాంస్కృతిక రంగాల్లోనూ ప్రతిభ చాటాలని పిలుపునిచ్చారు. బాలల పట్ల అపారమైన ప్రేమాభిమానాలు కలిగిన పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు.అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన పాటలు, నృత్యాలు, వ్యాసరచన,



చిత్రలేఖనం, ప్రశ్నోత్తర పోటీలు అందరినీ ఆకట్టుకున్నాయి. వివిధ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విజేతలకు అతిథులు బహుమతులు అందజేసి అభినందించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు హరిబాబు, ఉపాధ్యాయులు వెంకట్ రెడ్డి, అంగన్‌వాడీ ఉపాధ్యాయులు, విద్యార్థులు, మల్లారం ఉపసర్పంచ్ యశోద, కార్యదర్శి సిద్దిక్ మియా, నాయకులు ఎర్రి నరసింహారావు, అయినాల రామలింగయ్య, వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

బాలల భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాలి.

. విద్యార్థులకు సర్పంచ్ జ్యోతి పిలుపు!

నెహ్రూ విగ్రహానికి ఘన నివాళులు..

బాలల గ్రామసభలో పాల్గొని విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం

ధర్మసాగర్ /వరంగల్ జిల్లా బ్యూరోనవంబర్ 14 (జర్నలిస్ట్ వార్త):
బాలల భవిష్యత్తే దేశ భవిష్యత్తు.. విద్యతోనే ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ధర్మసాగర్ మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ మాచర్ల జ్యోతి ఏలియా విద్యార్థులకు పిలుపునిచ్చారు. భారత తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతి, బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం ధర్మసాగర్‌లో నిర్వహించిన కార్యక్రమాల్లో ఆమె పాల్గొన్నారు. తొలుత నెహ్రూ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం ధర్మసాగర్ మేజర్





గ్రామపంచాయతీ బాలికల పాఠశాలలో నిర్వహించిన బాలల గ్రామసభలో పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. విద్యార్థులు చదువుపై నిర్లక్ష్యం వీడి లక్ష్యసాధన దిశగా కష్టపడి చదవాలని, క్రమశిక్షణ, పట్టుదలతో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. తల్లిదండ్రుల ఆశయాలను నెరవేరుస్తూ ఉపాధ్యాయులకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని పిలుపునిచ్చారు. బాలల హక్కులు, విద్యా ప్రాధాన్యతను గుర్తించి ప్రతి విద్యార్థి బాధ్యతాయుతంగా ఎదగాలని ఆకాంక్షించారు.మాటలకే పరిమితం కాకుండా విద్యార్థులతో మమేకమైన సర్పంచ్ జ్యోతి మధ్యాహ్న భోజన సమయంలో వారితో కలిసి కూర్చుని భోజనం చేశారు. ప్రజాప్రతినిధులు విద్యార్థుల మధ్యకు వచ్చి వారి సమస్యలు తెలుసుకోవడం, వారిలో ఆత్మవిశ్వాసం నింపడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ కొంత కొమరమ్మ, ధర్మసాగర్ ఎంపీఓ, పంచాయతీ కార్యదర్శి, కారోబార్, ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యతోనే మాదిగ విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు

ఎస్సీ వర్గీకరణ ఫలాలను అందిపుచ్చుకొని ఉన్నతంగా ఎదగాలి



వర్ధన్నపేట, నవంబర్ 14 (జర్నలిస్ట్ వార్త):వర్ధన్నపేట మండలం ల్యాబర్తి గ్రామంలో శనివారం మాదిగ విద్యార్థి సమాఖ్య నూతన గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశానికి గ్రామ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి అధ్యక్షుడు సంకినేని సంజీవ మాదిగ అధ్యక్షత వహించారు.ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా హాజరైన మండల మాదిగ సంక్షేమ పోరాట సమితి అధ్యక్షుడు ముత్యాల మల్లేశం మాదిగ, మండల మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి అధ్యక్షుడు చాడ కరుణాకర్ మాదిగ మాట్లాడుతూ 32 ఏళ్ల పోరాట ఫలితంగా సాధించిన ఎస్సీ వర్గీకరణ ప్రయోజనాలను ప్రతి మాదిగ విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఉన్నత చదువులు అభ్యసించి మంచి ఉద్యోగాలు సాధించాలని, చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ క్రమశిక్షణతో జీవితంలో ఎదగాలని సూచించారు. మందకృష్ణ మాదిగ సాగిస్తున్న పోరాటం మాదిగ పీడిత వర్గాల భవిష్యత్తు కోసమేనని పేర్కొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక అధ్యక్షుడు: చిలుముల మణికంఠ మాదిగ అధికార ప్రతినిధి: ముండ్లపల్లి బన్నీ మాదిగ
ఉపాధ్యక్షుడు: చిలుముల్ల శ్రీరామ్ మాదిగ ప్రధాన కార్యదర్శి: ముండ్లపల్లి అభినయ్ మాదిగ
కార్యవర్గ సభ్యులుగా చిలుముల ప్రశాంత్ మాదిగ, కాకర్ల రాజు మాదిగ, చిలుముల రాజు మాదిగ, తాటికల శేఖర్ మాదిగ తదితరులు పాల్గొన్నారు

లక్ష్య సాధనకు నిరంతర కృషి అవసరం

విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం. - ఎంపీవో కూచన ప్రకాశ్





రాయపర్తి/ నవంబర్ 14 (జర్నలిస్ట్ వార్త):
విద్యార్థులు చిన్ననాటి నుంచే ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధనకు నిరంతరం కృషి చేయాలని రాయపర్తి మండల పంచాయతీ అధికారి కూచన ప్రకాశ్ సూచించారు. శనివారం రాయపర్తిలోని జిల్లా పరిషత్ పాఠశాలలో సర్పంచ్ గారే సహేంద్ర అధ్యక్షతన నిర్వహించిన బాలల గ్రామసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులని, సమాజ నిర్మాణంలో విద్యార్థుల పాత్ర కీలకమని పేర్కొన్నారు. చదువుతోపాటు క్రీడలు, సామాజిక అంశాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. గ్రామాభివృద్ధి, పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు సంబంధించి విద్యార్థుల అభిప్రాయాలు తెలుసుకోవడానికి బాలల గ్రామసభలు ఉపయోగపడతాయని తెలిపారు.
అనంతరం విద్యార్థులు పాఠశాల అవసరాలు, పరిసరాల పరిశుభ్రత తదితర సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. విద్యార్థులు లేవనెత్తిన సమస్యలను త్వరలో పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఎంపీవో హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గారే కృష్ణమూర్తి, ఉపాధ్యాయులు, గ్రామపంచాయతీ కార్యదర్శి గుగులోత్ యాకుబ్ నాయక్, ఏపీఎం యాదగిరి, విద్యార్థులు, గ్రామస్థాయి అధికారులు పాల్గొన్నారు.

అర్హులకు చేయూత.. పింఛన్ల ప్రొసీడింగ్స్ పంపిణీ

పేదల సంక్షేమానికి పెద్దపీట.. సర్పంచ్ మాచర్ల జ్యోతి ఏలియా





ధర్మసాగర్/వరంగల్ ఉమ్మడి జిల్లా బ్యూరో నవంబర్ 14 (జర్నలిస్ట్ వార్త): అర్హులైన పేదలకు ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందించడంలో భాగంగా ధర్మసాగర్ మేజర్ గ్రామపంచాయతీలో నూతనంగా మంజూరైన చేయూత పింఛన్ల ప్రొసీడింగ్స్‌ను సర్పంచ్ మాచర్ల జ్యోతి ఏలియా లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఎన్నో రోజులుగా పింఛన్ల కోసం ఎదురుచూస్తున్న అర్హులకు నూతన పింఛన్ల మంజూరుతో ఆర్థిక భరోసా లభించనుంది. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా గ్రామపంచాయతీ తరపున కృషి చేస్తామని సర్పంచ్ పేర్కొన్నారు.ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన పేదలకు చేరినప్పుడే వాటి లక్ష్యం నెరవేరుతుందని, పింఛన్లు నిరుపేద కుటుంబాలకు కొండంత అండగా నిలుస్తాయని ఈ సందర్భంగా తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్, ఎంపీఓ, గ్రామపంచాయతీ కార్యదర్శి, కారోబార్, పింఛన్ల లబ్ధిదారులు, గీత కార్మికులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

చేర్యాలలో చోరీ..

ఇంటి తాళం పగలగొట్టి రూ.10 వేల నగదు, 15 తులాల వెండి విగ్రహాలు అపహరణ

దీపావళికి ఊరెళ్లిన కుటుంబం.. అదును చూసి ఇంట్లోకి చొరబడిన దొంగలు

జనగామ / చేర్యాల నవంబర్ 14 (జర్నలిస్ట్ వార్త):
చేర్యాల పట్టణంలో దొంగలు బీభత్సం సృష్టించారు. ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులు ఊరెళ్లిన విషయాన్ని అదునుగా తీసుకున్న దుండగులు తాళం పగలగొట్టి ఇంట్లోకి చొరబడి నగదు, వెండి విగ్రహాలను అపహరించారు.బాధితురాలు గుండేటి బాలమణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. దీపావళి పండుగ మరుసటి రోజు ఇంటికి తాళం వేసి ఆమె కరీంనగర్‌కు వెళ్లారు. రోజూ మాదిరిగానే శనివారం ఉదయం పనిమనిషి ఇంటికి వచ్చేసరికి తలుపు తాళం పగలగొట్టి ఉండటాన్ని గమనించింది. వెంటనే బాలమణికి ఫోన్ చేసి సమాచారం అందించింది. ఆమె హుటాహుటిన ఇంటికి చేరుకుని చూడగా, ఇల్లు మొత్తం చిందరవందరగా కనిపించింది.ఇంట్లో భద్రపరిచిన రూ.10 వేల నగదుతో పాటు సుమారు 15 తులాల వెండి విగ్రహాలు కనిపించకపోవడంతో చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సమాచారం అందుకున్న చేర్యాల పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై గూడా అపూర్వ రెడ్డి తెలిపారు.



అణగారిన ప్రజల పక్షం
RNI NO: TELTEL/2023/87607
జర్నలిస్ట్ వార్త
తెలుగు దిన పత్రిక

నెహ్రూ దార్శనికతతోనే ఆధునిక భారత నిర్మాణం

ధర్మసాగర్ బాలుర పాఠశాలలో ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు

శాస్త్రీయ ఆలోచన, ప్రజాస్వామ్య విలువలు అలవర్చుకోవాలి: ప్రధానోపాధ్యాయుడు ధర్మ ప్రకాష్

ధర్మసాగర్ /నవంబర్ 14 (జర్నలిస్ట్ వార్త):
బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని ధర్మసాగర్ బాలుర పాఠశాలలో శనివారం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆధునిక భారతదేశ నిర్మాణంలో తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ దూరదృష్టి అనే అంశంపై ప్రత్యేక సదస్సు నిర్వహించారు.

ఈ సదస్సులో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ధర్మ ప్రకాష్ ప్రసంగిస్తూ, స్వాతంత్ర్యానంతరం భారతదేశాన్ని విజ్ఞాన, సాంకేతిక, విద్యా, పారిశ్రామిక రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించడంలో నెహ్రూ కీలక పాత్ర పోషించారని వివరించారు. సాంకేతిక విద్యాసంస్థలు, జాతీయ సాంకేతిక విద్యాసంస్థలు, అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ వంటి ప్రతిష్ఠాత్మక విద్యా, వైద్య సంస్థల ఏర్పాటుకు పునాదులు



వేయడంతో పాటు పరిశోధనా సంస్థలు, విజ్ఞాన రంగాల అభివృద్ధికి ఆయన విశేష ప్రాధాన్యతనిచ్చారని పేర్కొన్నారు. అంతరిక్ష పరిశోధనలకు పునాదులు వేయడంలోనూ ఆయన దూరదృష్టి స్పష్టంగా కనిపిస్తుందన్నారు.

భారత రాజ్యాంగంలోని 51ఏ(ష్ట) అధికరణం సూచించిన శాస్త్రీయ దృక్పథం, మానవతావాదం, ప్రశ్నించే తత్వం, సంస్కరణాభిలాష వంటి విలువలను ప్రతి విద్యార్థి అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. పంచశీల సూత్రాల ద్వారా ప్రపంచ శాంతి, సహజీవనం, పరస్పర గౌరవానికి నెహ్రూ ప్రాధాన్యతనిచ్చారని వివరించారు.

నేటి బాలలే రేపటి భారత పౌరులని, వారిలో శాస్త్రీయ ఆలోచన, ప్రజాస్వామ్య విలువలు, దేశభక్తి, సమానత్వ భావనలను పెంపొందించడమే బాలల దినోత్సవం అసలైన స్ఫూర్తి అని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన బృంద నృత్యాలు, వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కవిత, సురేష్, కిరణ్మయి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు

నేరాల నియంత్రణలో అలసత్వం వద్దు!

గంజాయి అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపాలి.. సైబర్ నేరాల కట్టడికి అప్రమత్తంగా ఉండాలి

ధర్మసాగర్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన ఏసీపీ ప్రశాంత్ రెడ్డి

ధర్మసాగర్ /వరంగల్ ఉమ్మడి జిల్లా బ్యూరో
నవంబర్ 14 (జర్నలిస్ట్ వార్త):
నేరాల నియంత్రణలో నిర్లక్ష్యానికి తావులేకుండా, శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా పోలీసులు విధులు నిర్వర్తించాలని కాజీపేట ఏసీపీ ప్రశాంత్ రెడ్డి స్పష్టం చేశారు. వార్షిక తనిఖీలో భాగంగా శనివారం ధర్మసాగర్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన ఆయన పోలీస్ శాఖ పనితీరుపై క్షేత్రస్థాయి సమీక్ష నిర్వహించారు. స్టేషన్‌లోని వివిధ రికార్డులు, నమోదైన కేసులు, నేరాల గణాంకాలను క్షుణ్ణంగా పరిశీలించి పెండింగ్ కేసుల పరిష్కారం, నేరాల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలపై ఆరా తీశారు. అనంతరం స్థానిక సీఐ అనుముల శ్రీనివాస్, ఎస్ఐతో పాటు పోలీస్ సిబ్బందితో సమావేశమైన ఏసీపీ.. సమాజానికి పెనుముప్పుగా పరిణమిస్తున్న గంజాయి అక్రమ రవాణా, వినియోగంపై కఠినంగా





వ్యవహరించాలని ఆదేశించారు. గంజాయి సరఫరా వెనుక ఉన్న మూలాలను గుర్తించి అక్రమ కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయాలని సూచించారు. సైబర్ నేరాలు రోజురోజుకూ విస్తరిస్తున్న నేపథ్యంలో ప్రజలను అప్రమత్తం చేస్తూ గ్రామస్థాయిలో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని దిశానిర్దేశం చేశారు.అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై నిరంతర నిఘా కొనసాగించాలని, ప్రజల భద్రతకు విఘాతం కలిగించే చర్యలను ఉపేక్షించరాదని స్పష్టం చేశారు. విధి నిర్వహణలో క్రమశిక్షణ, బాధ్యత, జవాబుదారీతనం పాటించాలని పోలీస్ సిబ్బందికి సూచించారు. విధి ఒత్తిళ్ల మధ్య వ్యక్తిగత ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయవద్దని హితవు పలికారు.ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని, పోలీస్ శాఖపై ప్రజల్లో విశ్వాసం మరింత పెరిగేలా నిబద్ధతతో పనిచేయాలని ఏసీపీ ప్రశాంత్ రెడ్డి ఆదేశించారు.

బాలల భవిష్యత్తుకు భరోసా..

విద్యార్థులతో బాలల గ్రామసభ!

విద్య, క్రీడలు, పాఠశాలల అభివృద్ధికి ప్రాధాన్యం..

బాలల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు

విద్యార్థులకు దిశానిర్దేశం చేసిన ఏసీపీ ప్రశాంత్ రెడ్డి, సీఐ శ్రీనివాస్

వేలేరు/ఉమ్మడి జిల్లా బ్యూరో నవంబర్ 14 (జర్నలిస్ట్ వార్త):
బాలల హక్కుల పరిరక్షణ, విద్యార్థుల సమస్యల పరిష్కారం, పాఠశాలల అభివృద్ధే లక్ష్యంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు వేలేరు మేజర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ బిల్లా యాదగిరి అధ్యక్షతన బాలల గ్రామసభను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కాజీపేట ఏసీపీ ప్రశాంత్ రెడ్డి, ధర్మసాగర్ సీఐ అనుముల శ్రీనివాస్, వేలేరు ఎస్సై దూదిమెట్ల నరేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏసీపీ ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పిలుపునిచ్చారు. పిల్లల భవిష్యత్తు కోసం తల్లిదండ్రులు పడుతున్న కష్టాన్ని గుర్తించి వారి ఆశయాలను నెరవేర్చాలని సూచించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల మాటలను గౌరవిస్తూ క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత ఉద్యోగాలు సాధించాలని విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు.సీఐ శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు సమాజంలో జరుగుతున్న పరిణామాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు.





సామాజిక మాధ్యమాలు, చరవాణుల వినియోగంలో అప్రమత్తంగా ఉండాలని, వాటి వల్ల కలిగే అనర్థాలకు దూరంగా ఉండాలని హెచ్చరించారు. చెడు అలవాట్లకు బానిసలు కాకుండా లక్ష్యసాధన దిశగా ముందుకు సాగాలని సూచించారు.

సర్పంచ్ బిల్లా యాదగిరి మాట్లాడుతూ భారత తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకొని జాతీయ బాలల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా బాలల గ్రామసభలను ఏర్పాటు చేసి విద్యార్థులతో నేరుగా మాట్లాడటం, వారు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకోవడం, పాఠశాలల్లో అవసరమైన అభివృద్ధి పనులను గుర్తించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవడం అభినందనీయమన్నారు. పిల్లలందరికీ నాణ్యమైన విద్య, మెరుగైన పాఠశాల వసతులు, క్రీడా సౌకర్యాలు కల్పించడం సర్పంచ్‌గా తన బాధ్యత అని స్పష్టం చేశారు.

పేదరికం కారణంగా ఏ ఒక్క చిన్నారి కూడా చదువుకు దూరం కాకూడదన్న లక్ష్యంతో ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. నేటి బాలలే రేపటి భావి భారత పౌరులని, వారి భవిష్యత్తు కోసం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామని పేర్కొన్నారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి సహకారంతో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి పెద్ద మొత్తంలో నిధులు మంజూరు చేయించి పాఠశాలలను అభివృద్ధి చేశామని తెలిపారు. బాలలందరికీ హృదయపూర్వక బాలల దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ శ్రీకర్, గ్రామపంచాయతీ కార్యదర్శి విజయ, జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సత్యం, లీలాబాయి, సీసీ రమాదేవి, వార్డు సభ్యులు సంధ్య, మౌనిక, పర్వీన్, సురేష్, సునీల్, ఉపాధ్యాయులు, వీవో అధ్యక్షులు, సీఏలు, అంగన్‌వాడీ ఉపాధ్యాయులు, సుమారు 250 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

రైతుల గురించి మాట్లాడే ముందు పల్లా వాస్తవాలు తెలుసుకోవాలి

రైతుల కార్యక్రమాలకు హాజరుకాకుండా ప్రభుత్వంపై విమర్శలా? -మాటలు కోటలు దాటుతున్నా.. చేతలు గడప దాటడం లేదు

జనగామ/చేర్యాల, నవంబర్ 14 (జర్నలిస్ట్ వార్త):
రైతుల సంక్షేమం గురించి మాట్లాడే ముందు జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి వాస్తవాలు తెలుసుకోవాలని మార్కెట్ కమిటీ చైర్మన్ కొమ్మూరి ప్రశాంత్ రెడ్డి హితవు పలికారు. చేర్యాల మండలం ఆకునూరు గ్రామంలో శనివారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పల్లా రాజేశ్వర్ రెడ్డిపై తీవ్ర విమర్శలు చేశారు.చేర్యాల పట్టణంలోని వాసవి కాటన్ ఇండస్ట్రీస్‌లో శుక్రవారం భారత పత్తి సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పత్తి కొనుగోలు కేంద్రం ప్రారంభోత్సవానికి పల్లా రాజేశ్వర్ రెడ్డి హాజరుకాలేదని, అలాంటిది నేడు కాంగ్రెస్ ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించడం లేదంటూ విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందని ప్రశ్నించారు. ప్రైవేటు కార్యక్రమాలపై చూపుతున్న శ్రద్ధ రైతులకు సంబంధించిన



కార్యక్రమాలపై కూడా చూపించాలని సూచించారు.
రైతులకు సంబంధించిన కార్యక్రమాలకు దూరంగా ఉంటూ, రైతుల సంక్షేమం కోసం పనిచేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేయడం సరికాదన్నారు. పల్లా రాజేశ్వర్ రెడ్డి వ్యవహారశైలి 'శుష్కప్రియాలు.. శూన్యహస్తాలు' అన్న చందంగా ఉందని ఎద్దేవా చేశారు. మాటలు కోటలు దాటుతున్నా చేతలు మాత్రం గడప దాటడం లేదని, రైతుల పక్షాన నిలబడితే మాటల్లో కాకుండా చేతల్లో నిరూపించాలని సవాల్ విసిరారు.రైతుల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని, రైతులకు అండగా నిలిచేందుకు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి కొనుగోళ్లకు అవసరమైన చర్యలు చేపడుతోందని స్పష్టం చేశారు. చిట్యాల, ముస్త్యాల, వీరన్నపేట, చుంచనకోట, కడవేరుగు, తాడూరు, గుర్జకుంట, రాంపూర్, పాత దొమ్మాట గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మల్లారెడ్డిపల్లిలో అభివృద్ధి కార్యక్రమాలకు ఏర్పాట్లు



హసన్‌పర్తి/ నవంబర్ 14 (జర్నలిస్ట్ వార్త):



హసన్‌పర్తి మండలం మల్లారెడ్డిపల్లి గ్రామంలో ఆదివారం నిర్వహించనున్న అభివృద్ధి కార్యక్రమాలకు అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో గ్రామంలో చేపట్టిన ఏర్పాట్లను అధికారులు, సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పరిశీలించారు.ఆదివారం ఉదయం 9 గంటలకు వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు కడియం కావ్య, హనుమకొండ డీసీసీ అధ్యక్షుడు ఇనుగాల వెంకట్రామిరెడ్డి, రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) గ్రామంలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా నూతన గ్రామపంచాయతీ భవనంతో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించనున్నారు. అలాగే అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలను అందజేయనున్నారు.ఈ కార్యక్రమానికి మండలంలోని కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, సహకార సంఘాల చైర్మన్లు, డైరెక్టర్లు, మార్కెట్ కమిటీ ప్రతినిధులు, పార్టీ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులకు ఆహ్వానం పలికారు.

తాటికొండలో ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు

చిన్నారుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం.. సర్పంచ్ సుజన శ్రీనివాస్



స్టేషన్ ఘన్‌పూర్ /నవంబర్ 14 (జర్నలిస్ట్ వార్త):మండలంలోని తాటికొండ గ్రామంలో అన్ని అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో భారత తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకొని జాతీయ బాలల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గ్రామ సర్పంచ్ సుజన శ్రీనివాస్ హాజరై చిన్నారులకు బాలల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నేటి బాలలే రేపటి భావి భారత పౌరులని, వారి భవిష్యత్తుకు పునాది వేసే బాధ్యత సమాజంపై ఉందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బాలల సమస్యలను నేరుగా తెలుసుకునేందుకు ప్రత్యేక బాలల గ్రామసభలను నిర్వహిస్తోందని తెలిపారు. ఈ సభల ద్వారా పిల్లలు ఎదుర్కొంటున్న సమస్యలు, పాఠశాలల్లో అవసరమైన మౌలిక వసతులు, అభివృద్ధి పనులను గుర్తించి వాటి పరిష్కారానికి గ్రామపంచాయతీ నిధులు కేటాయిస్తున్నట్లు వివరించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు జనగామ జిల్లా షూటింగ్ బాల్ జట్టు

క్రీడాకారులకు క్రీడా దుస్తులు పంపిణీ చేసిన అన్నెపు కుమార్



స్టేషన్ ఘన్‌పూర్/ నవంబర్ 14 (జర్నలిస్ట్ వార్త): స్టేషన్ ఘన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని చాగల్ గ్రామంలో జనగామ జిల్లా షూటింగ్ బాల్ ప్రధాన కార్యదర్శి అన్నెపు కుమార్ శనివారం రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన జూనియర్ బాలికల జట్టు క్రీడాకారులకు క్రీడా దుస్తులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా అన్నెపు కుమార్ మాట్లాడుతూ నవంబర్ 14, 15, 16 తేదీల్లో అన్నారం గ్రామంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ జూనియర్ బాలికల పోటీల్లో పాల్గొనేందుకు జనగామ జిల్లా జట్టు బయలుదేరిందని తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలకు వెళ్లే క్రీడాకారులకు ప్రోత్సాహం అందించాలనే ఉద్దేశంతో క్రీడా దుస్తులను పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. క్రీడాకారులు ప్రతిభను చాటుకుని జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు దిలీప్ కుమార్, సుధాకర్, సాంబరాజ్, రేణుక, మహాలక్ష్మి, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణకు పాల్పడితే చర్యలు

మహబూబాబాద్/
నవంబర్ 14 (జర్నలిస్ట్ వార్త):



తొర్రూరు పట్టణంలోని స్కానింగ్ సెంటర్లలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు శనివారం తనిఖీలు నిర్వహించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి. రవి రాథోడ్ ఆధ్వర్యంలో ఫారం-ఎఫ్ రికార్డులు, ఆడిట్ వివరాలు, స్కానింగ్ యంత్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భస్థ శిశువు లింగ నిర్ధారణ చేయడం, వెల్లడించడం చట్టరీత్యా నేరమని హెచ్చరించారు. పీసీపీఎన్‌డీటీ చట్ట నిబంధనలు ఉల్లంఘిస్తే మూడేళ్ల వరకు జైలు శిక్ష, రూ.50 వేల జరిమానా విధించే అవకాశం ఉందన్నారు. స్కానింగ్ కేంద్రాల నిర్వాహకులు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. తనిఖీల్లో వైద్యాధికారులు డాక్టర్ జలిత, మనోహర్, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

భారత్ సమ్మిట్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు





హసన్‌పర్తి/ నవంబర్ 14 (జర్నలిస్ట్ వార్త):
హైదరాబాద్‌లో కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ సమ్మిట్ కార్యక్రమంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజాస్వామ్య పరిరక్షణ, రాజ్యాంగ విలువలు, సామాజిక న్యాయం, సమానత్వం, ప్రజా సమస్యలపై నాయకులతో చర్చించారు. ప్రజల హక్కుల పరిరక్షణకు కాంగ్రెస్ పార్టీ నిరంతరం కృషి చేస్తుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి, ఎంపీ బలరాం నాయుడు, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ అభ్యర్థి రాంరెడ్డి వెంకటరెడ్డి, హనుమకొండ జిల్లా జేబీఎం చైర్మన్ జన్నపురెడ్డి రుగ్వేద్ రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణే నేచర్ కేర్ ట్రస్ట్ ప్రధాన లక్ష్యం

మొక్కలు నాటడమే కాదు.. వాటి సంరక్షణ కూడా మన బాధ్యత -నారాయణపురంలో మొక్కలు నాటిన ట్రస్ట్ సభ్యులు



కేసముద్రం/నవంబర్ 15 (జర్నలిస్ట్ వార్త):
పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా నేచర్ కేర్ ట్రస్ట్ ముందుకు సాగుతోందని ట్రస్ట్ చైర్మన్ బండారు వెంకట రమణ అన్నారు. మహబూబాబాద్‌కు చెందిన నేచర్ కేర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కేసముద్రం మండలం నారాయణపురం గ్రామంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గ్రామ సర్పంచ్ ధారావత్ యమున సుమన్ నాయక్, ట్రస్ట్ చైర్మన్ బండారు వెంకట రమణ హాజరయ్యారు.
ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పెరుగుతున్న వాహనాలు, పరిశ్రమల కారణంగా వాతావరణ కాలుష్యం రోజురోజుకూ తీవ్రరూపం దాల్చుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. అడవుల విస్తీర్ణం తగ్గిపోవడం, చెట్ల నరికివేతతో ప్రకృతి సమతుల్యత దెబ్బతింటోందని, ఫలితంగా వర్షాభావ పరిస్థితులు ఏర్పడుతున్నాయని పేర్కొన్నారు. ఎల్‌నినో వంటి వాతావరణ మార్పులు కూడా మానవ మనుగడకు సవాలుగా మారుతున్నాయని తెలిపారు.పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, భావితరాలకు స్వచ్ఛమైన గాలిని, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించాలంటే విస్తృతంగా మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. ఈ లక్ష్యంతోనే నేచర్ కేర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వివిధ గ్రామాల్లో మొక్కలు నాటే కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. మొక్కలు నాటడంతోనే బాధ్యత ముగియదని, వాటిని పెంచి పెద్ద చేసే వరకు సంరక్షణ బాధ్యతను కూడా ప్రతి ఒక్కరూ తీసుకోవాలని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు తోట లాలయ్య, మడత వెంకన్న, గ్రామ వార్డు సభ్యులు గుగులోత్ లచ్చు, జె. వీరన్న, పి. అశోక్, జి. భక్షు, బి. కన్య, గ్రామ పెద్దలు లక్ష్మీపతి, సోమిరెడ్డి, కీమా, రామ్మూర్తి, సుమన్, ఫీల్డ్ అసిస్టెంట్ సురేష్, అనిత, ఉపేందర్, శ్రీకాంత్, మధు, సురేష్, రవి, అంగన్వాడీ సిబ్బంది జ్యోతి, సునీత, అశోక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల రికార్డుల తప్పులతో విద్యార్థిని ఉన్నత చదువులకు ఆటంకం!



వేంసూరు/ నవంబర్ 14 (జర్నలిస్ట్ వార్త):
పాఠశాల యాజమాన్యం రికార్డుల్లో చేసిన తప్పులు ఓ విద్యార్థిని ఉన్నత చదువులకు ఆటంకంగా మారాయని వేంసూరు మండలం మర్లపాడు గ్రామానికి చెందిన పిల్లి సుధాకర్ ఆవేదన వ్యక్తం చేశారు. తన కుమార్తె సిరివెన్నెల గతంలో న్యూ సాంగ్ పాఠశాలలో ఒకటి, రెండో తరగతులు చదివిందని, అనంతరం పాల్వంచ గురుకుల పాఠశాలలో ప్రవేశం పొందిందని తెలిపారు. అయితే పాత పాఠశాల రికార్డుల్లో పుట్టిన తేదీ, ఇంటిపేరు తప్పుగా నమోదు కావడంతో ధ్రువపత్రాల సమస్య ఎదురైందన్నారు. ఈ వివరాలను సరిచేయాలని 40 రోజులుగా పాఠశాల చుట్టూ తిరుగుతున్నా పరిష్కారం కావడం లేదని ఆరోపించారు. యాజమాన్యం విధిస్తున్న షరతులతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని వాపోయారు. విద్యాశాఖ అధికారులు వెంటనే స్పందించి రికార్డుల్లో తప్పులను సరిచేసి విద్యార్థినికి అవసరమైన ధ్రువపత్రాలు అందేలా చర్యలు తీసుకోవాలని, పాఠశాల యాజమాన్యంపై విచారణ జరపాలని కోరారు

కొత్తపల్లిలో ఘనంగా బాలల గ్రామసభ



స్టేషన్ ఘన్‌పూర్ /నవంబర్ 14 (జర్నలిస్ట్ వార్త):నెహ్రూ జయంతిని పురస్కరించుకుని తెలంగాణ ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలోని కొత్తపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో శనివారం బాలల గ్రామసభ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన సర్పంచ్ ముక్కెర స్వరూప రవి యాదవ్ నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. మొబైల్ ఫోన్లు, సామాజిక మాధ్యమాల వినియోగంలో జాగ్రత్తలు పాటించాలని, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని తెలిపారు. బాలల సమస్యలు, పాఠశాలల్లో అవసరమైన అభివృద్ధి పనులను గ్రామసభలో చర్చించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ గోవిందు ఇసాక్, వార్డు సభ్యులు, కారోబార్ మారబోయిన కుమారస్వామి, అంగన్‌వాడీ టీచర్లు రజిత, రేణుక, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతిభావంతులకు 50 శాతం ఫీజు తిరిగి చెల్లింపు





తల్లాడ/నవంబర్ 14 (జర్నలిస్ట్ వార్త):విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహించేందుకు యూనివర్సల్ విద్యాలయం యాజమాన్యం చేపట్టిన ఫీజు రీయింబర్స్‌మెంట్ కార్యక్రమం అభినందనీయమని విద్యావేత్త రవికాంత్ అన్నారు. శనివారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో గత విద్యా సంవత్సరంలో ఒకటి నుంచి పదో తరగతి వరకు ప్రథమ ర్యాంకులు సాధించిన విద్యార్థులకు చెల్లించిన ఫీజులో 50 శాతం తిరిగి అందజేశారు. ఈ సందర్భంగా రవికాంత్ మాట్లాడుతూ విద్యార్థులు అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత లక్ష్యాలు సాధించాలని సూచించారు. పాఠశాల అభివృద్ధికి కృషి చేసిన రోహిణి, సిరి, నాగమణిలను యాజమాన్యం సన్మానించింది. కార్యక్రమంలో కరస్పాండెంట్ టి.కె. ప్రసన్నన్, డైరెక్టర్ మేరీ సోఫియా, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేటి బాలలే రేపటి పౌరులు

ఎల్కతుర్తి/నవంబర్ 14 (జర్నలిస్ట్ వార్త):



నేటి బాలలే రేపటి పౌరులని, విద్యతోనే సమాజంలోని సమస్యలకు పరిష్కారం లభిస్తుందని సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు పుల్లూరి శ్రీధర్ రావు అన్నారు. బాలల దినోత్సవం సందర్భంగా వీరనారాయణపూర్ గ్రామ పాఠశాలలో నిర్వహించిన బాలసభలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు చదువుతో ఉన్నత లక్ష్యాలను సాధించాలని, బాల కార్మిక వ్యవస్థ, బాల్య వివాహాల నిర్మూలనకు విద్య ఎంతో అవసరమని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులకు స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామ కార్యదర్శి, విద్యార్థులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ కార్యాలయంలో ఘనంగా బాలల దినోత్సవం



తల్లాడ/నవంబర్ 14 (జర్నలిస్ట్ వార్త):
తల్లాడ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకుని శనివారం బాలల దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గొడుగునూరి లక్ష్మారెడ్డి, సీనియర్ నాయకుడు దుండేటి వీరారెడ్డి నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశ ప్రధానిగా నెహ్రూ చేసిన సేవలను కొనియాడారు. బాలలపై ఆయనకు ఉన్న ప్రేమకు గుర్తుగా జయంతిని బాలల దినోత్సవంగా జరుపుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో కోడూరు రాము, అన్నారుగూడెం మాజీ వీడీసీ చైర్మన్ మారెళ్ల మల్లికార్జునరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మాజీ వార్డు సభ్యుడి మృతదేహానికి నివాళులు



స్టేషన్ ఘన్‌పూర్/ నవంబర్ 14 (జర్నలిస్ట్ వార్త):
స్టేషన్ ఘన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని 14వ వార్డుకు చెందిన మాజీ వార్డు సభ్యుడు నర్మెట ప్రభాకర్ మృతి చెందారు. విషయం తెలుసుకున్న పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు అంబటి కిషన్ రాజ్ శనివారం ఆయన పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు చింత ఎల్లయ్య, 14వ వార్డు కమిటీ అధ్యక్షుడు రాజరాపు ఎలియా, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

మద్దూర్ కేజీబీఎస్ లో స్వయంపరిపాలనదినోత్సవం

విద్యార్థినులే ఉపాధ్యాయులైన వేళ



జనగామ /చేర్యాల నవంబర్ 14(జర్నలిస్ట్ వార్త) ;బాలల దినోత్సవం సందర్భంగా మద్దూరు మండల కేంద్రంలోని కస్తూర్బా బాలికల పాఠశాలలో పలు కార్యక్రమం నిర్వహించారు భారత ప్రథమప్రధానమంత్రి జవహర్ లాల్ నెహ్రూజన్మదినం బాలలదినోత్సవం పురస్కరించుకొని విద్యార్థినులచేఉపన్యాసాలు పాటలు స్వయం పరిపాలన దినోత్సవాన్ని కూడానిర్వహించారు. ఈ కార్యక్రమం లోపాఠశాల ప్రత్యేక అధికారి స్వప్న ఉపాధ్యాయ బృందం విద్యార్థులు పాల్గొన్నారు



మిరాకిల్ మైండ్స్ పాఠశాలలో ఘనంగా బాలల దినోత్సవం

సత్తుపల్లి/ నవంబర్ 14 (జర్నలిస్ట్ వార్త):



సత్తుపల్లి సిద్ధారం రోడ్డులోని మిరాకిల్ మైండ్స్ ది స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ పాఠశాలలో శనివారం బాలల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎంపీడీవో ఎం. నాగేశ్వరరావు జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చిన్ననాటి నుంచే క్రమశిక్షణ, మంచి అలవాట్లు అలవరచుకుని చదువుపై శ్రద్ధ చూపాలన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ రత్నాకర్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థిలోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు, నృత్యాలు, పాటలు ఆకట్టుకున్నాయి. అనంతరం చిన్నారులకు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు

వివేకవర్ధిని పాఠశాలలో ఘనంగా బాలల దినోత్సవం



కేసముద్రం/నవంబర్ 14 (జర్నలిస్ట్ వార్త):కేసముద్రంలోని శ్రీ వివేకవర్ధిని పాఠశాలలో శనివారం బాలల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల ఆటపాటలు, నృత్యాలు, సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. పదో తరగతి విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ చిర్ర యాకాంతం గౌడ్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడలు, కళల్లో రాణించాలని, క్రమశిక్షణతో ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చిర్ర నరేష్, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా అంబేద్కర్ యువజన సంఘం అర్ధ శతాబ్ది ఉత్సవాలు



కేసముద్రం/ నవంబర్ 14 (జర్నలిస్ట్ వార్త):కేసముద్రం మున్సిపాలిటీ తెలంగాణ రాష్ట్ర అంబేద్కర్ యువజన సంఘం కమిటీ ఆధ్వర్యంలో సంఘం 50 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా శనివారం అర్ధ శతాబ్ది ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని అంబేద్కర్ విగ్రహాన్ని అలంకరించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంఘం అధ్యక్షుడు సోమారపు మధార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ సమానత్వం, సామాజిక న్యాయం, విద్య, హక్కుల సాధన కోసం అంబేద్కర్ చేసిన కృషి చిరస్మరణీయమన్నారు. సంఘం 50 ఏళ్లుగా సామాజిక చైతన్యం కోసం చేస్తున్న కృషిని కొనియాడారు.కార్యక్రమంలో కౌన్సిలర్ జాటోత్ సుజాత హరినాయక్, పురం రాజమణి రమేష్, అరుణ దేవేందర్, డాక్టర్ నజీర్ అహ్మద్, గుగులోత్ వీరు నాయక్, ఉప్పునూతల రమేష్, ముత్యాల నాగమణి శివకుమార్, చాగంటి కిషన్, శివారపు శ్రీధర్, కంటిపూడి అరుణ్, తారా సింగ్, మేకల ఏడుకొండలు, శ్రీరామ్ కిరణ్, ఎండీ తాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ గ్రామర్ స్కూల్‌లో ఘనంగా బాలల దినోత్సవం





కల్లూరు/ నవంబర్ 14 (జర్నలిస్ట్ వార్త):
కల్లూరులోని తెలంగాణ గ్రామర్ స్కూల్ (ఈ.ఎం.)లో శనివారం బాలల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు జవహర్‌లాల్ నెహ్రూ జీవిత విశేషాలను, బాలలపై ఆయనకున్న ప్రేమను విద్యార్థులకు వివరించారు. విద్యార్థులకు ఆటలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించగా ఉత్సాహంగా పాల్గొని ప్రతిభను చాటారు. పాఠశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రమశిక్షణ, మంచి విలువలు అలవర్చుకుని బాధ్యతగల పౌరులుగా ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇకపై ఆ ప్రొసీజర్ మెట్ల బావులకు కూడా వర్తింపజేస్తాం : హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్



హైదరాబాద్,నవంబర్ 14 (జర్నలిస్ట్ వార్త):
తెలంగాణలో చెరువుల పునరుద్ధరణకు అమలు చేస్తున్న స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్స్ (ఎస్‌వోపీ)లను ఇకపై చారిత్రక మెట్ల బావుల పరిరక్షణకు కూడా వర్తింపజేయనున్నట్లు హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ వెల్లడించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మెట్ల బావుల పరిరక్షణ, అవగాహన కార్యక్రమంలో ఆయన ఈ కీలక ప్రకటన చేశారు. ఈ బృహత్తర కార్యక్రమాన్ని భవిష్యత్తులో జాతీయ స్థాయి విధానంగా ముందుకు తీసుకెళ్లే అవకాశాలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. హైదరాబాద్ నగరంలో నీటి ఎద్దడి, వరద నియంత్రణ, కరవు నివారణ అంశాలపై వచ్చే మంగళవారం కేంద్ర హోంశాఖ కార్యదర్శితో సమావేశం కానున్నట్లు రంగనాథ్ తెలిపారు. ఈ భేటీలో చెరువుల సంరక్షణతో పాటు ప్రాచీన మెట్ల బావుల పునరుద్ధరణను కూడా ప్రధాన ఎజెండాగా చేర్చనున్నట్లు చెప్పారు. చెరువులతో పోలిస్తే మెట్ల బావులు వికేంద్రీకృత జల వనరులుగా సమాజానికి ఎంతో మేలు చేస్తాయని ఆయన వివరించారు. గతంలో ఆలయాలు, చెరువుల పరిసరాల్లో ఉన్న అనేక మెట్ల బావులు కాలక్రమేణా కనుమరుగయ్యాయని, వాటిని తిరిగి వెలుగులోకి తెచ్చి పునరుద్ధరిస్తే భూగర్భ జల మట్టాలు గణనీయంగా పెరుగుతాయని స్పష్టం చేశారు. ప్రస్తుతం ఎల్ నినో ప్రభావంతో నెలకొన్న నీటి కొరత నేపథ్యంలో ఈ చర్యలు ఎంతో ఆవశ్యకమని ఆయన అభిప్రాయపడ్డారు. ఇప్పటికే హైదరాబాద్ పరిధిలో దాదాపు అంతరించిపోయిన పలు చెరువులను హైడ్రా విజయవంతంగా పునరుద్ధరించిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తుచేశారు. అధికారిక లెక్కల ప్రకారం తెలంగాణవ్యాప్తంగా 600కు పైగా, గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో 160కి పైగా మెట్ల బావులు ఉన్నట్లు గుర్తించారు. క్షేత్రస్థాయిలో వీటి సంఖ్య మరింత ఎక్కువగా ఉండే అవకాశముంది. కాగా, ఈ సదస్సు సందర్భంగా ఆకర్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో తెలంగాణ సంప్రదాయ మెట్ల బావుల వారసత్వం, పూర్వకాలపు నీటి సంరక్షణ పద్ధతులపై ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర పర్యావరణ, అటవీ, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ మాట్లాడుతూ.. ప్రస్తుత నీటి సంక్షోభం కారణంగా పురాతన నీటి పరిరక్షణ పద్ధతులపై ప్రాధాన్యత పెరిగిందన్నారు. సంప్రదాయ జల వనరుల సంరక్షణకు సంబంధించిన కీలక అంశాలను క్యూర్ చట్టంలో చేర్చినట్లు ఆయన వెల్లడించారు. ప్రాచీన జల వనరులకు జీవం పోయడం ద్వారా నగరంలో నీటి భద్రతను పటిష్ఠం చేయవచ్చని అధికారులు భావిస్తున్నారు.

త్రివేణి పాఠశాలలో ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు



సత్తుపల్లి/నవంబర్ 14 (జర్నలిస్ట్ వార్త):
సత్తుపల్లిలోని త్రివేణి పాఠశాలలో బాలల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఎం. సరిత మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని, క్రమశిక్షణ, పట్టుదలతో విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. క్యాంపస్ ఇన్‌ఛార్జ్ వంశీ, అకాడమిక్ ఇన్‌ఛార్జ్ పవన్, కిడ్స్ ఇన్‌ఛార్జ్ శ్రీపద్మ, డైరెక్టర్ జి.వి., సి.ఆర్.ఓ. మురళీకృష్ణ విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థులు నృత్యాలు, ప్రసంగాలు, జాతీయ నాయకుల వేషధారణతో అలరించారు. వేడుకల్లో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

చిన్నారులకు బహుమతులు అందజేసిన ఎన్ఎస్ యుఐ జిల్లా కార్యదర్శి




స్టేషన్ ఘన్‌పూర్,నవంబర్ 14 (జర్నలిస్ట్ వార్త) :
స్టేషన్ ఘన్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని శివుని పల్లిలో గల అంగన్వాడి కేంద్రంలో యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ జానీ బాబా చిన్నారులకు బాలల దినోత్సవం శుభాకాంక్షలు తెలియజేశారు. నెహ్రూ జయంతి సందర్భంగా జవహర్లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బాలల దినోత్సవం సందర్భం గా చిన్నారులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో యువజన నాయకులు నీల మహేష్, వినయ్,ఎండి అష్టల్, రాహుల్,సృజన్ తదితరులు పాల్గొన్నారు.

మంచితనం మితిమీరితే.. బలహీనతగా మారుతుందా?



మనిషికి ఉండాల్సిన గొప్ప లక్షణాల్లో మంచితనం ఒకటి. ఎదుటివారికి సహాయం చేయడం, కష్టాల్లో ఉన్నవారికి అండగా నిలవడం, ఇతరుల బాధను తన బాధగా భావించడం మానవత్వానికి నిదర్శనం. అయితే మంచితనం మితిమీరితే అదే మనిషికి బలహీనతగా మారే ప్రమాదం ఉంది. మన మంచితనాన్ని గుర్తించి గౌరవించే వారు కొందరైతే, దానిని తమకు అనుకూలంగా మలుచుకునే వారు మరికొందరు. అందరితో మంచిగా ఉండాలనే ఆలోచనతో ప్రతి విషయంలోనూ మౌనంగా ఉండటం, తప్పు చేసినా ఎదురు ప్రశ్నించకపోవడం, మనసుకు బాధ కలిగినా బయటపడకుండా భరించడం మంచితనం కాదు. అది ఎదుటివారికి మనల్ని తక్కువగా అంచనా వేసే అవకాశం కల్పిస్తుంది. ఒకసారి సహాయం చేస్తే అభినందించే వ్యక్తులు, అదే సహాయం పదేపదే ఆశిస్తూ బాధ్యతగా భావించడం మొదలుపెడితే అక్కడే సంబంధాల అసలు స్వరూపం బయటపడుతుంది. మంచితనానికి హద్దులు ఉండాలి. ఎదుటివారిని గౌరవించడం ఎంత ముఖ్యమో, ఆత్మగౌరవాన్ని కాపాడుకోవడం కూడా అంతే ముఖ్యం. తప్పును తప్పుగా చెప్పే ధైర్యం ఉండాలి. అవసరమైన చోట ప్రశ్నించాలి. మన సహనాన్ని చేతకానితనంగా భావించే పరిస్థితి రాకుండా చూసుకోవాలి. మౌనాన్ని అంగీకారంగా, సహాయాన్ని బలహీనతగా భావించే వారికి తగిన సమాధానం చెప్పగలగాలి. ముఖ్యంగా సమాజంలో మంచివారిగా ఉండటం అంటే అందరికీ తలవంచడం కాదు. న్యాయం కోసం నిలబడటం, అన్యాయాన్ని ప్రశ్నించడం, అవసరమైనప్పుడు కఠినంగా వ్యవహరించడం కూడా మంచితనంలో భాగమే. వ్యక్తిత్వం లేని మంచితనం కంటే ఆత్మగౌరవంతో కూడిన మంచితనం ఎంతో విలువైనది. మంచితనం మనిషికి ఆభరణం కావాలి కానీ ఇతరులు ఆడుకునే ఆటవస్తువు కాకూడదు. క్షమించడం గొప్ప గుణమే. కానీ పదేపదే అదే తప్పును సహించడం వివేకం కాదు. ప్రేమించాలి. గౌరవించాలి. సహాయం చేయాలి. అదే సమయంలో మన విలువను మనమే తగ్గించుకోకూడదు. ఎందుకంటే మంచితనానికి విలువ ఉండాలి. మనిషికి ఆత్మగౌరవం ఉండాలి. మంచితనం మితిమీరితే మనిషి గొప్పవాడు కాదు. ఇతరుల స్వార్థానికి బలయ్యే ప్రమాదం ఉంది.

నల్లబెల్లి పాఠశాలలో ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు





వర్ధన్నపేట/నవంబర్ 14 (జర్నలిస్ట్ వార్త):
నల్లబెల్లి గ్రామంలోని స్థానిక ప్రభుత్వ పాఠశాలలో గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో బాలల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి హుస్సేన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గ్రామ ఉపసర్పంచ్ మేకల దేవేందర్ హాజరయ్యారు. ముందుగా భారత తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఉపసర్పంచ్ మేకల దేవేందర్ మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులని, విద్యార్థులు చిన్ననాటి నుంచే క్రమశిక్షణతో చదువుతూ ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. పాఠశాల అభివృద్ధికి, విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు గ్రామపంచాయతీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు బిరు రేణుక, ముత్యం రేణుక, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సెర్ఫ్ సీసీ రేణుక, స్వయం సహాయక సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణలో పెట్టుబడులు పెట్టండి

మీ పెట్టుబడులకు రక్షణ, లాభం

ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తుంది

2034 నాటికి లక్ష కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణ

ఆరోగ్య రంగంలో పీహెచ్ఎఫ్ఐ కీలక పాత్ర పోషిస్తుంది: సీఎం రేవంత్



హైదరాబాద్,నవంబర్ 14 (జర్నలిస్ట్ వార్త):
తెలంగాణలో పెట్టుబడులు పెట్టే పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. రాష్ట్రంలో పెట్టుబడుల కు రక్షణ ఉందని, లాభం కూడా ఉంటుందని చెప్పారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టాలని పారిశ్రామికవేత్తలకు పిలుపునిచ్చారు. శనివారం ఓ ప్రైవేటు హోటల్‌లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో 'పబ్లిక్ హెల్త్ సైన్సెస్ సంస్థ (పీహెచ్ఎఫ్ఐ)' క్యాం పస్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసి, క్యాంపస్ మాస్టర్‌ప్లాన్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడారు.

"విద్య, వైద్యం, పరిశ్రమ లు, సేవారంగాల్లో రాష్ట్రాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లడమే మా లక్ష్యం. తెలంగాణకు ప్రపంచ వ్యాప్త గుర్తింపు, హైదరాబాద్‌కు పెద్ద ఎత్తున పెట్టుబడులు రావడంలో ఐఎస్‌బీ, నల్సార్ వంటి విద్యాసంస్థలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. వైద్య రంగంలోనూ హైదరాబాద్‌కు అంతర్జాతీయ గుర్తింపు తీసుకొచ్చేందుకు పీహెచ్ఎఫ్ఐ వంటి సంస్థలు దోహదపడతాయి. ఆ సంస్థకు స్వయంగా బ్రాండ్ అంబాసిడర్‌గా ఉంటా. గత నాయకులు దూరదృష్టితో తీసుకు న్న నిర్ణయాలే నేటి అభివృద్ధికి పునాదులు. నెహ్రూ విద్య, నీటిపారుదల రంగాలకు ప్రాధాన్యత ఇచ్చారు. రాజీవ్‌గాంధీ తీసుకొచ్చిన సాంకేతిక మార్పులు దే శంలో సమాచార సాంకేతిక రంగం అభివృద్ధికి బాటలు వేశాయి. ప్రపంచంలోని ప్రముఖ ఫార్చ్యూన్-500 కంపెనీల్లో భారతీయులు ఉన్నత పదవుల్లో రాణిస్తున్నారు. తెలంగాణలోని మారుమూల గ్రామంలో ఉన్న విద్యార్థి కూడా అమెరికాలో పనిచేసే వారితో పోటీపడే స్థాయికి ఎదగాలి" అని ఆయన ఆకాంక్షించారు.

రాష్ట్రంలో గతంలో చంద్రబాబు, వైఎస్ఆర్, కేసీఆర్ ప్రభుత్వాలు తీసుకొచ్చిన మంచి విధానాలను తమ ప్రభుత్వం కొనసాగిస్తోందన్నారు. పెట్టుబడిదారులు, విద్యాసంస్థల విషయం లో తమకు ఎలాంటి వివక్ష లేదని చెప్పారు. తెలంగాణను 2047 నాటికి అభివృద్ధి చెందిన రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు తెలంగాణ రైజింగ్-2047 విజన్‌ను రూపొందించామని తెలిపారు. ఔటర్ రింగ్ రోడ్డు అవతల రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణం చేపడుతున్నామని.. 160 కిలోమీటర్ల రహదారికి కేంద్రం టెండర్లు పిలిచిందని, దక్షిణభాగాన్ని రాష్ట్రప్రభుత్వ పరిధిలోనే చేపట్టబోతున్నామని వెల్లడించారు. ఆర్ఆర్ఆర్ చుట్టూ సుమారు 10వేల చదరపుకిలోమీటర్ల పరిధిలో తయారీ రంగాన్ని అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. 2034 నాటికి తెలంగాణను ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమన్నారు. దేశ జీడీపీలో రాష్ట్రం వాటా 10శాతానికి చేర్చేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలో పెట్టుబడులకు అనుకూల వాతావరణం ఉందని చెప్పారు.

రీజినల్ రింగు రోడ్డు ప్రాజెక్టులో దక్షిణభాగాన్ని రాష్ట్ర ప్రభుత్వమే నిర్మించనుంది. సీఎం రేవంత్ పీహెచ్ఎఫ్ఐ క్యాంపస్ శంకుస్థాపన సందర్భంగా చేసిన వ్యాఖ్యలతో ఈ అంశంపై స్పష్టత వచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే దక్షిణ భాగం ప్రాజెక్టును రోడ్లు-భవనాల శాఖ పరిధి నుంచి తప్పిస్తూ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ శాఖకు అనుబంధంగా ఉండే హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్ (హెచ్‌జీసీఎల్)కు అప్పగించింది. ఆర్ఆర్ఆర్ దక్షిణభాగానికి సంబంధించిన అన్ని పనులను హెచ్‌జీసీఎల్ మేనేజింగ్ డైరెక్టర్ పర్యవేక్షిస్తారని పేర్కొంది. కానీ నిర్మాణ బాధ్యతలపై ఆ ఉత్తర్వుల్లో స్పష్టత ఇవ్వకపోవడం తో.. డీపీఆర్ సహా అన్ని వ్యవహారాలను పూర్తిచేసి కేంద్రానికి నివేదిక సమర్పిస్తారన్న అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి.

కానీ రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోనే నిర్మించనున్నామని సీఎం రేవంత్ తాజాగా తేల్చిచెప్పడంతో స్పష్టత వచ్చింది. నిజానికి 2023 డిసెంబరులో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటుకాగానే రీజనల్ రోడ్డుపై ఫోకస్ చేసింది. ఉత్తరభాగంలో భూసేకరణ ఒక కొలిక్కి రావడంతో.. చౌటుప్పల్ నుంచి సంగారెడ్డి వరకు ఉన్న దక్షిణభాగంపై దృష్టిపెట్టింది. తొలుత దీనిని కేంద్రమే నిర్మించాలని కోరింది. కానీ 2024 జూలైలో ఈ రోడ్డు అలైన్‌మెంట్, నిర్మాణానికి రాష్ట్రప్రభుత్వమే చర్యలు చేపట్టింది. కానీ నిధులు, ఇతర అంశాలను దృష్టిలో పెట్టుకుని దక్షిణభాగం పనులను చేపట్టడంటూ 2024 డిసెంబరులో కేంద్రానికి విజ్ఞప్తి చేసింది. భూసేకరణ వ్యయంలో 50 శాతం భరిస్తామని తెలిపింది. ఈ క్రమంలో దక్షిణభాగం నిర్మాణానికి కేంద్రం సుముఖత వ్యక్తం చేసింది. కానీ ఆ తర్వాత అడుగు ముందుకు పడలేదు. ఈ క్రమంలో మళ్లీ రాష్ట్ర ప్రభుత్వమే దక్షిణభాగంపై కార్యాచరణ మొదలుపెట్టింది.

ఈవీ ఛార్జింగ్ స్టేషన్ పనులు వేగవంతం చేయాలి





ఖమ్మం/ నవంబర్ 14 (జర్నలిస్ట్ వార్త):
ఖమ్మం బైపాస్ రోడ్డులో నూతనంగా నిర్మిస్తున్న ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీ) ఛార్జింగ్ స్టేషన్ పనులను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శనివారం పరిశీలించారు. పనుల పురోగతిపై అధికారులను, నిర్వాహకులను వివరాలు అడిగి తెలుసుకుని నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా కనకమేడల గోపాలకృష్ణమూర్తి, జక్కంపూడి కిషోర్, జక్కంపూడి రాము తదితరులు మంత్రిని శాలువాతో సత్కరించి స్వాగతం పలికారు.

అంతర్జాతీయ ప్రజల పత్రిక
RNI NO: TELTEL/2023/87607
జర్నలిస్ట్ వార్త
తెలుగు బిడ్డల ఎక్స్‌ప్రెస్..
ఆదివారం15 నవంబర్ 2026

హార్దిక్‌తో జట్టుకు మరింత సమతూకం



అర్ష్‌దీప్‌ను వదులుకోవడం కష్టమైన నిర్ణయం.. పంజాబ్ కింగ్స్ సహ యజమాని మోహిత్ బర్మన్

న్యూఢిల్లీ, నవంబర్ 14: ఐపీఎల్-2027 సీజన్‌కు ముందు ముంబై ఇండియన్స్, పంజాబ్ కింగ్స్ మధ్య జరిగిన కీలక ఆటగాళ్ల మార్పిడిపై పంజాబ్ కింగ్స్ సహ యజమాని మోహిత్ బర్మన్ స్పందించారు. హార్దిక్ పాండ్యాను జట్టులోకి తీసుకోవడం వల్ల మరింత సమతూకం ఏర్పడిందని తెలిపారు. బ్యాటింగ్, బౌలింగ్‌తో పాటు నాయకత్వ లక్షణాలు కలిగిన హార్దిక్ జట్టుకు ఎంతో ఉపయోగపడతాడని పేర్కొన్నారు.హార్దిక్ ప్రపంచంలోని అత్యుత్తమ ఆల్‌రౌండర్లలో ఒకరని, ఒత్తిడిలోనూ మ్యాచ్ ఫలితాన్ని మార్చగల సామర్థ్యం ఉందని బర్మన్ అన్నారు. 2025లో ఫైనల్‌కు చేరిన పంజాబ్ కింగ్స్ ఈసారి టైటిల్ సాధించడమే లక్ష్యంగా ముందుకు సాగుతోందని తెలిపారు.కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ నాయకత్వంలో హార్దిక్ ఆడటంపై ఎలాంటి సమస్య లేదన్నారు. ఇద్దరు అనుభవజ్ఞులైన క్రికెటర్లు జట్టులో ఉండటం అదనపు బలమని అభిప్రాయపడ్డారు.మరోవైపు అర్ష్‌దీప్ సింగ్‌ను వదులుకోవడం చాలా కష్టమైన నిర్ణయమని బర్మన్ వెల్లడించారు. గత ఎనిమిది సీజన్లుగా పంజాబ్‌కు సేవలందించిన అర్ష్‌దీప్ అభిమానులకు ఎంతో ఇష్టమైన ఆటగాడని, అయితే జట్టు విజయాల కోసం కొన్ని కఠిన నిర్ణయాలు తప్పవని వివరించారు.హార్దిక్ పాండ్యా రూ. 18 కోట్ల ఒప్పందంతో పంజాబ్ కింగ్స్‌కు మారగా, అర్ష్‌దీప్ సింగ్ అదే మొత్తంతో ముంబై ఇండియన్స్‌కు చేరాడు.

ఆఖరి బంతి వరకు ఉత్కంఠ..

భారత్‌దే పైచేయి!



పాకిస్థాన్‌పై ఒక్క వికెట్ తేడాతో సంచలన విజయం.. అండర్-19 ఆసియా కప్ టైటిల్ కైవసం

దుబాయ్, నవంబర్ 14: అండర్-19 ఆసియా కప్ ఫైనల్‌లో యువ భారత్ అద్భుత పోరాట పటిమను ప్రదర్శించింది. చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌తో జరిగిన ఉత్కంఠభరిత పోరులో ఒక్క వికెట్ తేడాతో విజయం సాధించి ఆసియా ఛాంపియన్‌గా నిలిచింది. భారీ లక్ష్య ఛేదనలో ఒక దశలో ఓటమి అంచున నిలిచిన భారత జట్టును చివరి వికెట్‌కు ముందు వచ్చిన బ్యాటర్ల పోరాటం విజయతీరాలకు చేర్చింది. చివరి ఓవర్లలో నరాలు తెగే ఉత్కంఠ మధ్య సాగిన ఈ మ్యాచ్ క్రికెట్ అభిమానులకు అసలైన మజాను అందించింది.తొలుత బ్యాటింగ్ చేసిన పాకిస్థాన్ నిర్ణీత 50 ఓవర్లలో తొమ్మిది వికెట్ల నష్టానికి 336 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఆ జట్టు బ్యాటర్లు భారత బౌలర్లపై విరుచుకుపడ్డారు. ఉస్మాన్ ఖాన్ అద్భుత సెంచరీతో జట్టుకు భారీ స్కోరు అందించగా, అబ్దుల్ 80 పరుగులు, యూసఫ్ 63 పరుగులతో రాణించారు. వీరి భాగస్వామ్యాలతో పాకిస్థాన్ భారీ లక్ష్యాన్ని భారత్ ముందుంచింది. భారత బౌలర్లు ఆరంభంలో వికెట్లు తీసినా, పాకిస్థాన్ బ్యాటర్ల దూకుడును పూర్తిగా అడ్డుకోలేకపోయారు. భారత బౌలర్లలో కావ్య పటేల్ నాలుగు వికెట్లు పడగొట్టి ఆకట్టుకోగా, చిగురుపాటి వెంకట మూడు వికెట్లు సాధించాడు. అర్జున్ రాజ్‌పుత్ ఒక వికెట్ తీశాడు.337 పరుగుల విజయలక్ష్యంతో బరిలోకి దిగిన భారత జట్టుకు ఓపెనర్లు మంచి ఆరంభాన్ని అందించారు. లక్ష్య రాజేష్, ఆర్యవీర్ సెహ్వాగ్ ఆచితూచి ఆడుతూనే స్కోరు బోర్డును పరుగులు పెట్టించారు. ఆర్యవీర్ సెహ్వాగ్ 58 పరుగులతో కీలక ఇన్నింగ్స్ ఆడాడు. అయితే అతడు ఔటైన తర్వాత భారత జట్టుపై ఒత్తిడి పెరిగింది. పాకిస్థాన్ బౌలర్లు వరుసగా వికెట్లు తీస్తూ మ్యాచ్‌పై పట్టు సాధించే ప్రయత్నం చేశారు. మరోవైపు లక్ష్య రాజేష్ మాత్రం బాధ్యతాయుతంగా ఆడుతూ జట్టును లక్ష్యం దిశగా నడిపించాడు. అతడు 80 పరుగులు చేసి కీలక ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నాడు. అన్వయ్ ద్రావిడ్ 19 పరుగులు చేసి సహకారం అందించాడు.అయితే మధ్యలో వరుస వికెట్లు కోల్పోవడంతో భారత జట్టు విజయంపై అనుమానాలు నెలకొన్నాయి. భారీ లక్ష్యం కావడంతో ప్రతి పరుగూ కీలకంగా మారింది. పాకిస్థాన్ బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేస్తూ భారత బ్యాటర్లను ఒత్తిడిలోకి నెట్టారు. వికెట్లు పడుతున్నప్పటికీ భారత యువ ఆటగాళ్లు పోరాటం ఆపలేదు. చివరి దశలో మ్యాచ్ పూర్తిగా పాకిస్థాన్ వైపు మొగ్గుతున్నట్లు కనిపించింది. ఈ సమయంలో మనల్ చౌహాన్, మోహిత్ ఉల్వా క్రీజులో నిలిచి అసాధారణ పోరాటాన్ని ప్రదర్శించారు.మనల్ చౌహాన్ కేవలం 32 బంతుల్లో 47 పరుగులు చేసి భారత విజయానికి బలమైన పునాది వేశాడు. మరోవైపు మోహిత్ ఉల్వా 26 బంతుల్లోనే 49 పరుగులతో ప్రత్యర్థి బౌలర్లపై విరుచుకుపడ్డాడు. వీరిద్దరూ పాకిస్థాన్ బౌలింగ్‌ను ధైర్యంగా ఎదుర్కొంటూ బౌండరీలు, సిక్సర్లతో పరుగుల వేగాన్ని పెంచారు. ముఖ్యంగా చివరి ఓవర్లలో ఒత్తిడిని అధిగమించి ఆడిన తీరు అద్భుతం. వీరిద్దరూ కలిసి కేవలం 35 బంతుల్లో 57 పరుగులు జోడించడంతో భారత విజయావకాశాలు మళ్లీ మెరుగుపడ్డాయి.చివరి క్షణాల్లో ఒక్కో పరుగు కోసం ఇరు జట్లు తీవ్రంగా పోరాడాయి. పాకిస్థాన్ ఆటగాళ్లు విజయంపై ఆశతో బౌలింగ్ చేయగా, భారత బ్యాటర్లు మాత్రం ఏమాత్రం వెనుకడుగు వేయలేదు. చివరకు ఒక్క వికెట్ తేడాతో భారత్ లక్ష్యాన్ని అందుకుని చారిత్రాత్మక విజయాన్ని నమోదు చేసింది. ఈ గెలుపుతో యువ భారత జట్టు ఆసియా కప్‌ను సగర్వంగా కైవసం చేసుకుంది.ఈ విజయం భారత యువ క్రికెటర్ల ప్రతిభకు, ఒత్తిడిలోనూ పోరాడే సామర్థ్యానికి నిదర్శనంగా నిలిచింది. ముఖ్యంగా లక్ష్య ఛేదనలో విఫలమవుతుందనుకున్న దశ నుంచి జట్టును విజయతీరాలకు చేర్చిన మనల్ చౌహాన్, మోహిత్ ఉల్వా ప్రదర్శన ప్రత్యేకంగా నిలిచింది. అలాగే లక్ష్య రాజేష్, ఆర్యవీర్ సెహ్వాగ్ కీలక సమయంలో అందించిన పరుగులు కూడా విజయానికి దోహదపడ్డాయి.భారత్-పాకిస్థాన్ మ్యాచ్ అంటేనే అభిమానుల్లో ప్రత్యేక ఆసక్తి ఉంటుంది. అలాంటి చిరకాల ప్రత్యర్థుల మధ్య జరిగిన ఫైనల్ చివరి వరకు ఉత్కంఠభరితంగా సాగడం ఈ విజయానికి మరింత ప్రత్యేకతను తీసుకొచ్చింది. యువ ఆటగాళ్లు చూపిన పట్టుదల, సమష్టి కృషి భారత క్రికెట్ భవిష్యత్తుపై ఆశలు పెంచుతోంది. ఒక్క వికెట్ తేడాతో సాధించిన ఈ విజయం యువ భారత్‌కు చిరస్మరణీయ విజయంగా నిలిచిపోనుంది.

బుమ్రా బౌలింగ్‌ను ఎదుర్కోవడమే

అసలైన సవాల్!



ప్రపంచంలోని అత్యుత్తమ బౌలర్లలో బుమ్రా ఒకరు.. న్యూజిలాండ్ బ్యాటర్ విల్ యంగ్

మౌంట్ మాంగనూయి, నవంబర్ 14: భారత స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా బౌలింగ్‌ను ఎదుర్కోవడం తమకు అతిపెద్ద సవాల్‌గా నిలుస్తుందని న్యూజిలాండ్ బ్యాటర్ విల్ యంగ్ అన్నారు. భారత్‌తో జరగనున్న రెండు టెస్టుల సిరీస్‌లో బుమ్రా తిరిగి జట్టులోకి రావడం తమకు కఠిన పరీక్షేనని పేర్కొన్నారు. అయితే తమ జట్టులోనూ అద్భుతమైన బౌలర్లు ఉన్నారని, భారత బ్యాటర్లకు కూడా గట్టి సవాల్ విసురుతామని ధీమా వ్యక్తం చేశారు.ఈ నెల 19 నుంచి ప్రారంభం కానున్న టెస్టు సిరీస్‌కు బుమ్రా అందుబాటులో ఉండటం భారత జట్టుకు పెద్ద బలమని యంగ్ అభిప్రాయపడ్డారు. ప్రపంచంలోని అత్యుత్తమ బౌలర్లలో బుమ్రా ఒకరని, అతడి బౌలింగ్‌లో ప్రత్యేకమైన సవాళ్లు ఎదురవుతాయని తెలిపారు. మోకాలి గాయం కారణంగా ఆగస్టులో శ్రీలంక పర్యటనకు దూరమైన బుమ్రా తిరిగి రావడం భారత బౌలింగ్‌ను మరింత పటిష్టం చేస్తుందన్నారు. 2024లో భారత్‌లో జరిగిన టెస్టు సిరీస్‌లో న్యూజిలాండ్ 3-0తో విజయం సాధించిన విషయాన్ని ప్రస్తావిస్తూ.. ఆ సిరీస్ ఇప్పుడు గతమని, స్వదేశంలో జరిగే పోరు పూర్తిగా భిన్నంగా ఉంటుందని యంగ్ పేర్కొన్నారు. అప్పటి విజయం తమ జట్టు ఆత్మవిశ్వాసాన్ని పెంచిందని చెప్పారు. శ్రీలంక చేతిలో 2-0తో ఓటమి తర్వాత భారత్‌పై ప్రత్యేక వ్యూహాలతో బరిలోకి దిగి విజయం సాధించామని గుర్తుచేశారు.న్యూజిలాండ్‌లోని వెల్లింగ్టన్, క్రైస్ట్‌చర్చ్ మైదానాల్లో జరిగే టెస్టుల్లో వాతావరణ పరిస్థితులు, గాలి ప్రభావం కీలకంగా మారతాయని తెలిపారు. పరిస్థితులకు అనుగుణంగా ఆటగాళ్లు తమ నైపుణ్యాలను ప్రదర్శించాల్సి ఉంటుందన్నారు. మరోవైపు భారత వన్డే బౌలింగ్ విభాగాన్ని కూడా యంగ్ ప్రశంసించారు. అర్ష్‌దీప్ సింగ్ రెండు వైపులా బంతిని స్వింగ్ చేయగలడని, ఆకిబ్ నబీ కూడా మంచి ప్రతిభ చూపిస్తున్నాడని అన్నారు. అన్షుల్ కాంబోజ్, బ్రార్‌ల బౌలింగ్‌లోనూ ప్రత్యేకత ఉందని పేర్కొన్నారు. భారత్ బౌలింగ్ విభాగం సమతూకంగా ఉందని కొనియాడారు.వచ్చే ఏడాది జరిగే ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్‌కు అర్హత సాధించేందుకు ఇరు జట్లకూ ఈ సిరీస్ కీలకం కానుంది. దీంతో భారత్-న్యూజిలాండ్ మధ్య జరిగే రెండు టెస్టుల పోరు ఆసక్తికరంగా మారనుంది.



టెస్టు జట్టులో గుర్నూర్‌కు చోటు..

కుల్దీప్‌కు విశ్రాంతి!

హైదరాబాద్:న్యూజిలాండ్‌తో జరగనున్న రెండు టెస్టుల సిరీస్‌కు ముందు భారత జట్టులో కీలక మార్పు చోటుచేసుకుంది. యువ పేసర్ గుర్నూర్ బ్రార్‌కు సెలక్టర్లు అవకాశం కల్పించారు. మరోవైపు స్పిన్నర్ కుల్దీప్ యాదవ్‌ను టెస్టు జట్టు నుంచి విడుదల చేశారు. ఈ విషయాన్ని భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) శనివారం వెల్లడించింది.న్యూజిలాండ్‌తో జరుగుతున్న వన్డే సిరీస్‌లో భారత జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్న గుర్నూర్ బ్రార్ ఇకపై టెస్టు జట్టుతో చేరనున్నాడు. దీంతో ఆదివారం జరగనున్న చివరి వన్డేకు అతడు అందుబాటులో ఉండడు. నవంబర్ 19 నుంచి వెల్లింగ్టన్‌లో ప్రారంభమయ్యే తొలి టెస్టు కోసం నేరుగా జట్టుతో కలవనున్నాడు.మరోవైపు స్పిన్నర్ కుల్దీప్ యాదవ్‌కు దేశవాళీ క్రికెట్‌లో ఆడేందుకు బీసీసీఐ అనుమతించింది. ఉత్తరప్రదేశ్ జట్టు తరఫున ఆడేందుకు వీలుగా అతడిని టెస్టు జట్టు నుంచి విడుదల చేసింది. ఇప్పటికే వికెట్ కీపర్ రిషభ్ పంత్ టెస్టు జట్టుతో చేరాడు.భారత టెస్టు జట్టు: శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), యశస్వి జైస్వాల్, కేఎల్ రాహుల్, దేవదత్ పడిక్కల్, రిషభ్ పంత్, ధ్రువ్ జురెల్, రవీంద్ర జడేజా, అన్షుల్ కాంబోజ్, జస్‌ప్రీత్ బుమ్రా, ప్రసిద్ధ్ కృష్ణ, ఆకాశ్ దీప్, సాయి సుదర్శన్, నితీశ్ కుమార్ రెడ్డి, వాషింగ్టన్ సుందర్, మహమ్మద్ సిరాజ్, గుర్నూర్ బ్రార్.న్యూజిలాండ్ పర్యటనలో భాగంగా భారత్ రెండు టెస్టు మ్యాచ్‌లు ఆడనుంది. తొలి టెస్టు నవంబర్ 19న వెల్లింగ్టన్‌లో ప్రారంభం కానుంది. ఈ సిరీస్‌లో గుర్నూర్ బ్రార్‌కు లభించిన అవకాశాన్ని అతడు ఎలా సద్వినియోగం చేసుకుంటాడన్నది ఆసక్తికరంగా మారింది.

పాక్‌తో ఫైనల్లో ఆర్యవీర్ మెరుపులు.. అర్ధ సెంచరీ



హైదరాబాద్: అండర్-19 ఆసియా కప్ ఫైనల్‌లో భారత యువ ఓపెనర్ ఆర్యవీర్ సెహ్వాగ్ అర్ధ సెంచరీతో ఆకట్టుకున్నాడు. పాకిస్థాన్‌తో జరుగుతున్న కీలక పోరులో భారత జట్టు లక్ష్య ఛేదనలో నిలకడగా రాణిస్తోంది. 17 ఓవర్లు ముగిసే సమయానికి భారత్ ఒక వికెట్ నష్టానికి 98 పరుగులు చేసింది.ఓపెనర్‌గా బరిలోకి దిగిన ఆర్యవీర్ 58 పరుగులు చేసి ఔటయ్యాడు. మరోవైపు లక్ష్య రాజేష్ 37 పరుగులతో క్రీజులో నిలిచి జట్టుకు అండగా నిలిచాడు. వీరిద్దరూ కలిసి 100 బంతుల్లో 88 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. ఆర్యవీర్ వికెట్ కోల్పోయినప్పటికీ లక్ష్య ఛేదనలో భారత్ మంచి స్థితిలో కొనసాగుతోంది.అంతకుముందు టాస్ గెలిచిన పాకిస్థాన్ తొలుత బ్యాటింగ్ చేసి నిర్ణీత 50 ఓవర్లలో 337 పరుగులు చేసింది. భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన భారత బ్యాటర్లు ఆచితూచి ఆడుతూ పరుగులు రాబడుతున్నారు. ఆర్యవీర్ అర్ధ సెంచరీతో భారత్‌కు శుభారంభం లభించింది. ఈ ఉత్కంఠ భరిత ఫైనల్లో భారత యువ జట్టు విజయం సాధించి ఆసియా కప్‌ను కైవసం చేసుకుంటుందా అన్నది ఆసక్తికరంగా మారింది.

ఇసుక కాగితంతో గీతలు వేరుగా తెలుస్తాయి: వసీం అక్రమ్



క్రీడలు:2018లో ఆస్ట్రేలియా క్రికెట్‌లో సంచలనం సృష్టించిన బాల్ ట్యాంపరింగ్ వివాదం మరోసారి తెరపైకి వచ్చింది. ఈ వ్యవహారంపై ఆస్ట్రేలియా కెప్టెన్ పాట్ కమిన్స్ చేసిన వ్యాఖ్యలపై పాకిస్థాన్ మాజీ దిగ్గజ బౌలర్ వసీం అక్రమ్ స్పందించాడు. బంతిని పరిశీలించే అనుభవం ఉన్న బౌలర్‌కు సహజంగా ఏర్పడే గీతలకు, ఇసుక కాగితంతో గీసిన గీతలకు మధ్య తేడా వెంటనే తెలుస్తుందని అభిప్రాయపడ్డాడు.

బంతిపై గీతలను గుర్తించడం కష్టం కాదు పాట్ కమిన్స్ తనకు ఇసుక కాగితంతో బంతిని దెబ్బతీసే విషయం తెలియదని చెప్పడంపై అక్రమ్ తన అభిప్రాయాన్ని వెల్లడించాడు. బౌలర్‌గా బంతిని ఎప్పటికప్పుడు పరిశీలించడం, దాని ఒకవైపు మెరుపును కాపాడుకోవడం చాలా ముఖ్యమని తెలిపాడు. ఐదో ఓవర్‌లో అయినా, పదో ఓవర్‌లో అయినా, 50వ ఓవర్‌లో అయినా బంతిపై వచ్చే మార్పులను బౌలర్లు గమనిస్తారని పేర్కొన్నాడు. బంతి నేలకు తగలడం వల్ల ఏర్పడే గీతలకు, ఇసుక కాగితంతో రుద్దడం వల్ల ఏర్పడే గీతలకు స్పష్టమైన తేడా ఉంటుందని వివరించాడు.ఈ వివాదంలో తాను ఎవరి పక్షానా మాట్లాడటం లేదని అక్రమ్ స్పష్టం చేశాడు. కమిన్స్ తనకు మంచి స్నేహితుడని, గొప్ప క్రికెటర్ అని పేర్కొంటూనే, అనుభవజ్ఞుడైన బౌలర్‌గా బంతిని చూస్తే ఏదైనా అసాధారణంగా జరిగిందా లేదా గుర్తించగలనని చెప్పాడు. ఆస్ట్రేలియా క్రికెట్ నిజాయితీకి పేరొందిందని, ఈ వివాదం ఆ దేశ క్రికెట్ ప్రతిష్ఠపై ప్రభావం చూపుతోందని అభిప్రాయపడ్డాడు.**మళ్లీ తెరపైకి 2018 వివాదం**దక్షిణాఫ్రికాతో కేప్‌టౌన్‌లో జరిగిన టెస్టు మ్యాచ్ సందర్భంగా 2018లో బంతిని ఇసుక కాగితంతో రుద్దుతూ కెమెరాలకు చిక్కిన కామెరూన్ బాన్‌క్రాఫ్ట్ ఘటన అప్పట్లో ప్రపంచ క్రికెట్‌ను కుదిపేసింది. ఈ వ్యవహారంలో అప్పటి కెప్టెన్ స్టీవ్ స్మిత్, డేవిడ్ వార్నర్, బాన్‌క్రాఫ్ట్‌లపై క్రికెట్ ఆస్ట్రేలియా చర్యలు తీసుకుంది.తాజాగా ఉస్మాన్ ఖవాజా తన ఆత్మకథలో ఈ ఘటనపై చేసిన వ్యాఖ్యలతో వివాదం మళ్లీ మొదలైంది. జట్టులోని పలువురికి ఈ వ్యవహారం గురించి ముందే తెలుసని ఖవాజా పేర్కొన్నట్లు వార్తలు వచ్చాయి. అయితే పాట్ కమిన్స్ ఈ ఆరోపణలను తీవ్రంగా ఖండించాడు. తనకు ఇసుక కాగితంతో బంతిని దెబ్బతీసే విషయం తెలియదని, అలాంటి కుట్రలో తాను భాగస్వామిని కాదని స్పష్టం చేశాడు. ఈ నేపథ్యంలో వసీం అక్రమ్ వ్యాఖ్యలు క్రికెట్ వర్గాల్లో మరోసారి చర్చకు దారితీశాయి.

డబుల్ సక్సెస్‌తో దిల్ రాజు..

పవన్‌తో మరో సినిమాపై కీలక ప్రకటన?



ప్రముఖ నిర్మాత దిల్ రాజు ప్రస్తుతం రెట్టింపు ఉత్సాహంతో ఉన్నట్లు తెలిపారు. తాను పంపిణీ చేసిన రెండు సినిమాలు ఘనవిజయం సాధించడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, తన నిర్మాణ సంస్థ నుంచి రాబోయే చిత్రాల వివరాలను వెల్లడించాడు.తెలుగు రాష్ట్రాల్లో తాము పంపిణీ చేసిన రణబీర్ కపూర్ 'రామాయణం' చిత్రం ఇప్పటికే రూ. 1000 కోట్ల వసూళ్ల మార్కును అధిగమించిందని, లాంగ్ రన్‌లో రూ. 2000 కోట్ల నెట్ సాధించే అవకాశం ఉందని దిల్ రాజు అంచనా వేశారు. అలాగే నైజాం ఏరియాలో విడుదల చేసిన సూర్య నటించిన 'సీన్' చిత్రం కూడా ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుందని, తక్కువ బడ్జెట్‌లోనూ బలమైన కథాంశంతో విజయం సాధించవచ్చని ఈ సినిమా నిరూపించిందని పేర్కొన్నాడు. ఈ రెండు విజయాలు తనకు మరింత ఉత్సాహాన్ని ఇచ్చాయని ఆయన తెలిపాడు.

ఈ సందర్భంగా తన కొత్త ప్రాజెక్టుల వివరాలను ఆయన వెల్లడించాడు. రవితేజతో రూపొందించనున్న చిత్రానికి 'వీరాధి వీరులంట' అనే టైటిల్ ఖరారు చేశామని, ఫిబ్రవరి నుంచి చిత్రీకరణ ప్రారంభం కానుందని పేర్కొన్నాడు. సంగీత దర్శకుడు దేవిశ్రీ ప్రసాద్ హీరోగా పరిచయమవుతున్న 'ఎల్లమ్మ'తో పాటు విజయ్ దేవరకొండ కథానాయకుడిగా నటిస్తున్న 'రౌడీ జనార్దన' చిత్రాలను వచ్చే వేసవిలో విడుదల చేసేందుకు సన్నద్ధమవుతున్నట్లు తెలిపాడు.ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో మరో సినిమా చేసే అంశంపై చర్చలు జరిగినట్లు తెలిపాడు. కథ, దర్శకుడు ఖరారయ్యాక పూర్తి వివరాలతో అధికారిక ప్రకటన ఉంటుందని స్పష్టం చేశాడు. అలాగే, దర్శకుడు అనిల్ రావిపూడితో 2028 సంక్రాంతి కానుకగా ఒక సినిమాను విడుదల చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించాడు. వీటితో పాటు హిందీలో అక్షయ్ కుమార్, సల్మాన్ ఖాన్‌లతో తాను నిర్మిస్తున్న చిత్రాల విడుదల తేదీలను కూడా ఈ సందర్భంగా ఆయన ప్రకటించాడు.

'దాదా' ధమాకా మొదలైంది..

దుమ్మురేపుతున్న బాలయ్య, నర్గీస్ ఫక్రి పబ్ సాంగ్



నందమూరి బాలకృష్ణ కథానాయకుడిగా, దర్శకుడు గోపీచంద్ మలినేని రూపొందిస్తున్న భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'దాదా'. ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ చిత్రం నుంచి మేకర్స్ తొలి పాటను విడుదల చేశారు. 'దాదా ధమాకా' పేరుతో వచ్చిన ఈ పల్సేటింగ్ సాంగ్ అభిమానులను ఉర్రూతలూగిస్తోంది.

ఈ పాట బాలయ్య అభిమానులకు ఫుల్ మీల్స్ లాంటి ట్రీట్ అందిస్తోంది. వైబ్రెంట్ పబ్ బ్యాక్‌డ్రాప్‌లో బాలకృష్ణ, బాలీవుడ్ అందాల భామ నర్గీస్ ఫక్రిపై ఈ పాటను చిత్రీకరించారు. బాలయ్య, గోపీచంద్ మలినేని ఇద్దరితోనూ సూపర్ హిట్ ఆల్బమ్స్ ఇచ్చిన సంగీత దర్శకుడు ఎస్. తమన్, ఈ సినిమాకు కూడా తనదైన శైలిలో అదిరిపోయే ఎనర్జిటిక్ డ్యాన్స్ నంబర్‌ను అందించాడు. రామజోగయ్య శాస్త్రి రాసిన సాహిత్యం పాటకు మరింత ఉత్సాహాన్నిచ్చింది. ఈ పాటలో విశేషమేమిటంటే, గాయని రజని శ్రీ పూర్ణిమతో పాటు బాలకృష్ణ స్వయంగా కొంత భాగం ఆలపించి అభిమానులకు సర్‌ప్రైజ్ ఇచ్చారు.

విజువల్స్ పరంగా కూడా ఈ పాట ఆకట్టుకుంటోంది. శేఖర్ వీజే మాస్టర్ తన కొరియోగ్రఫీతో బాలయ్య మార్క్ స్టెప్పులను స్టైలిష్‌గా డిజైన్ చేశారు. సన్ గ్లాసెస్, సిగార్‌తో బాలయ్య పార్టీ అవతార్‌లో కనిపించగా, నర్గీస్ ఫక్రి తన గ్లామర్‌తో స్క్రీన్‌పై మెరిశారు. వీరిద్దరి మధ్య కెమిస్ట్రీ, ఎనర్జిటిక్ డ్యాన్స్ మూమెంట్స్ పాటకు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి.'వీరసింహారెడ్డి' వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత బాలకృష్ణ, గోపీచంద్ మలినేని కాంబినేషన్‌లో వస్తున్న రెండో చిత్రమిది. వృద్ధి సినిమాస్ పతాకంపై వెంకట సతీశ్ కిలారు ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. ఇందులో మనోజ్ మంచు, కాజల్ అగర్వాల్ కీలక పాత్రలు పోషిస్తున్నారు.

ఇటీవల గాయం కారణంగా శస్త్రచికిత్స చేయించుకుని విశ్రాంతి తీసుకున్న బాలకృష్ణ, మళ్లీ షూటింగ్‌లో చేరినట్లు చిత్ర యూనిట్ వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం సినిమా చిత్రీకరణ చివరి దశకు చేరుకుంది. అరవింద్ ఎస్ కశ్యప్ సినిమాటోగ్రఫీ, నవీన్ నూలి ఎడిటింగ్, సాయి మాధవ్ బుర్రా సంభాషణలు అందిస్తున్నారు. ఈ చిత్రాన్ని డిసెంబర్ 24న క్రిస్మస్ కానుకగా ప్రపంచవ్యాప్తంగా విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు

చిరుకు కథ చెప్పిన త్రివిక్రమ్..

డీవీవీ బ్యానర్‌లో భారీ ప్రాజెక్ట్!



మెగాస్టార్ చిరంజీవి, స్టార్ డైరెక్టర్ త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్‌లో ఓ సినిమా రాబోతోందనే వార్తలు టాలీవుడ్‌లో జోరుగా చక్కర్లు కొడుతున్నాయి. వీరిద్దరి కలయికలో సినిమా కోసం మెగా అభిమానులు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న నేపథ్యంలో ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించి ఆసక్తికరమైన చర్చలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. ప్రముఖ నిర్మాణ సంస్థ డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై ఈ చిత్రాన్ని నిర్మించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయని సమాచారం.

ఫిల్మ్ నగర్ వర్గాల ప్రకారం.. ఇటీవల త్రివిక్రమ్ శ్రీనివాస్ మెగాస్టార్ చిరంజీవిని కలిసి ఓ ఆసక్తికరమైన కథాంశాన్ని వినిపించారు. ఈ స్టోరీ లైన్ చిరంజీవిని బాగా ఆకట్టుకుందని, పూర్తి స్క్రిప్ట్‌ను సిద్ధం చేయమని ఆయన త్రివిక్రమ్‌కు సూచించినట్లు చెబుతున్నారు. నిర్మాత డీవీవీ దానయ్య ఈ కాంబినేషన్‌ను సెట్ చేసేందుకు చురుగ్గా ప్రయత్నిస్తున్నారని, గతంలో త్రివిక్రమ్‌తో ఉన్న కమిట్‌మెంట్ మేరకు ఈ ప్రాజెక్ట్‌ను పట్టాలెక్కించాలని చూస్తున్నారని ఇండస్ట్రీలో టాక్ నడుస్తోంది.గతంలో చిరంజీవి నటించిన 'జై చిరంజీవ' చిత్రానికి త్రివిక్రమ్ కథ, మాటలు అందించారు. కానీ, ఆయన దర్శకత్వంలో మెగాస్టార్ నటించలేదు. అయితే, పవన్ కల్యాణ్, అల్లు అర్జున్ వంటి ఇతర మెగా హీరోలతో త్రివిక్రమ్ బ్లాక్‌బస్టర్ హిట్స్ ఇచ్చారు. దీంతో చిరంజీవిని త్రివిక్రమ్ డైరెక్ట్ చేస్తే చూడాలని అభిమానులు దశాబ్దాలుగా ఆశిస్తున్నారు.ప్రస్తుతం త్రివిక్రమ్ తన తదుపరి ప్రాజెక్ట్‌పై దృష్టి సారించారు. జూనియర్ ఎన్టీఆర్‌తో 'గాడ్ ఆఫ్ వార్' అనే వర్కింగ్ టైటిల్‌తో ఓ భారీ మైథలాజికల్ సినిమాను తెరకెక్కించే పనుల్లో ఆయన బిజీగా ఉన్నారు. ఇటీవల ఎన్టీఆర్, కల్యాణ్ రామ్, నిర్మాత రాధాకృష్ణతో కలిసి త్రివిక్రమ్ దిగిన ఫొటో బయటకు రావడంతో ఆ ప్రాజెక్ట్ పక్కాగా పట్టాలెక్కుతోందని స్పష్టమైంది. మరోవైపు చిరంజీవి 'కాకా' అనే తన తదుపరి చిత్రం షూటింగ్‌లో పాల్గొంటున్నారు. ఈ సినిమాను సంక్రాంతికి విడుదల చేయాలని ప్లాన్ చేస్తున్నారు.ఈ నేపథ్యంలో ఎన్టీఆర్‌తో త్రివిక్రమ్ సినిమా పూర్తయిన తర్వాతే చిరంజీవితో ప్రాజెక్ట్ పట్టాలెక్కే అవకాశం ఉందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఈ క్రేజీ కాంబినేషన్‌పై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.

పెళ్లి పీటలు ఎక్కబోతున్న 'గద్దలకొండ గణేష్' ఫేమ్ మిర్నాళిని రవి



'గద్దలకొండ గణేష్' చిత్రంతో తెలుగు ప్రేక్షకులకు దగ్గరైన యువ నటి మిర్నాళిని రవి త్వరలోనే పెళ్లి పీటలెక్కనున్నారు. తన చిరకాల మిత్రుడు, పరంపొరుల్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు మహావిష్ణుతో ఆమె కొత్త జీవితాన్ని ప్రారంభించేందుకు సిద్ధమవుతున్నారు. ఈ క్రమంలో పెళ్లికి ముందు తన స్నేహితులతో కలిసి ఆమె బ్యాచ్‌లర్ పార్టీని గ్రాండ్‌గా ఎంజాయ్ చేశారు.

ఈ వేడుకకు సంబంధించిన ప్రత్యేక వీడియోను మిర్నాళిని స్వయంగా తన సోషల్ మీడియా ఖాతా ద్వారా అభిమానులతో పంచుకున్నారు. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతుండటంతో అభిమానులు, నెటిజన్లు ఆమెకు శుభాకాంక్షలు తెలుపుతున్నారు. మిర్నాళిని రవి, మహావిష్ణు మధ్య గత 7 ఏళ్లుగా మంచి స్నేహం ఉంది. ఆ పరిచయం కాస్తా ప్రేమగా మారడంతో, పెద్దల అంగీకారంతో ఈ ఏడాది ఆగస్టులో వీరి నిశ్చితార్థం అధికారికంగా జరిగింది. మహావిష్ణు ఆధ్యాత్మిక గురువుగా, ప్రముఖ వక్తగా గుర్తింపు పొందారు. వీరి వివాహ వేదిక, కచ్చితమైన తేదీపై త్వరలోనే స్పష్టత వచ్చే అవకాశం ఉంది. పెళ్లి తర్వాత ఆమె నటనకు దూరమవుతారనే ప్రచారం జరుగుతున్నప్పటికీ, దీనిపై మిర్నాళిని నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు.



న్యూ ఇయర్ కానుకగా ' వింటారా సరదాగా'

యంగ్ హీరో అశోక్ గల్లా, శ్రీ గౌరీ ప్రియ జంటగా నటిస్తున్న తాజా చిత్రం 'ఎఎఆ వింటారా సరదాగా' విడుదల తేదీ ఖరారైంది. నూతన సంవత్సర కానుకగా 2027 జనవరి 1న ఈ యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌ను ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల చేయనున్నట్లు చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. ప్రేమ, స్నేహం, వినోదం మేళవింపుగా రూపొందుతున్న ఈ చిత్రం యువతను విశేషంగా ఆకట్టుకుంటుందని మేకర్స్ ధీమా వ్యక్తం చేస్తున్నారు.ఉద్భవ్ రఘు దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా పూర్తిగా అమెరికా నేపథ్యంలో సాగుతుంది. ఉన్నత ఆశయాలతో విదేశాలకు వెళ్లిన తెలుగు విద్యార్థుల జీవితాలు, వారి జీవనశైలి, ఎదురయ్యే సవాళ్లు, స్నేహాలు, ప్రేమ ప్రయాణాల చుట్టూ ఈ కథనం నడుస్తుంది. విద్యార్థి దశలోని సరదా క్షణాలతో పాటు అనుకోని పరిస్థితులను హాస్యభరితంగా, ఆసక్తికరంగా దర్శకుడు తెరపై ఆవిష్కరించినట్లు తెలుస్తోంది.ఈ చిత్రంలో రాహుల్ విజయ్, శివాత్మిక రాజశేఖర్, సత్య, వైవా హర్ష, గుండు సుదర్శన్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు.



ప్రముఖ నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై సూర్యదేవర నాగవంశీ ఎస్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకంపై సాయి సౌజన్య సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.చిత్రానికి విజయ్ బుల్గానిన్ సంగీతం అందిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన 'అనగా అనగా అమెరికా', 'చింగారి' పాటలు శ్రోతల నుంచి మంచి ఆదరణ పొందాయి. సంజిత్ హెగ్డే పాడిన పాట అమెరికా ప్రయాణంలోని ఉత్సాహాన్ని ప్రతిబింబించగా, సిద్ శ్రీరామ్, లిప్సిక ఆలపించిన పాట ప్రేమలోని అనుభూతులను చక్కగా పలికించింది. ఇప్పటికే విడుదలైన రెండు టీజర్లు, హీరోహీరోయిన్ల మధ్య కెమిస్ట్రీ సినిమాపై సానుకూల బజ్‌ను ఏర్పరిచాయి. 2027 నూతన సంవత్సరాన్ని పూర్తి స్థాయి వినోదంతో ప్రారంభించేందుకు ఈ చిత్రం సిద్ధమవుతోంది.